నగ్నముని రచనలు మానవ మనుగడకు స్ఫూర్తి

- 'కొయ్యగుర్రం' మహాకావ్యం ఆవిష్కరణలో వక్తలు

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 109 | విజయవాడ, సోమవారం 20 నవంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 20 November 2023 | Rs

ఆరోసారి ప్రపంచ కప్‌తో ఆస్ట్రేలియా జట్టు సంబరాలు

థర్మల్ ప్లాంట్లకు బొగ్గు కొరత

- రెండు రోజులకే సరిపడ నిల్వలు
- సక్రమంగా సరఫరా చేయని రైల్వే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల పరిస్థితి దినదినగండంగా మారింది. ప్లాంట్లకు ఒక్క రోజు బొగ్గు ఆగినా అందులో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉండగా, రాష్ట్రంలో ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. కనీసం 15 రోజులకు 10,73,835 మెట్రిక్ టన్ను(ఎం.టి)ల బొగ్గు నిల్వలు ఉండాలి. అయితే, అవసరమైనదాంట్లో 9శాతం బొగ్గు మాత్రమే జెన్‌కో ప్లాంట్‌లో ప్రస్తుతం ఉంది. దీనిని సెంట్రల్ ఎలక్ట్రిసిటి అథారిటీ (సిఇఎ) సైతం ధ్రువీకరించింది. రాష్ట్రంలో జెన్‌కో ఆధ్వర్యంలో మూడు థర్మల్ ప్లాంట్లు నడుస్తున్నాయి. ఇవి నడవాలంటే రోజుకు 71,100 ఎం.టిల బొగ్గు అవసరం. ప్రస్తుతం మూడు ప్లాంట్లలో రెండింటిలో ఒకటిన్నర రోజుకు సరిపడా నిల్వలు మాత్రమే ఉన్నాయి. రైల్వే శాఖ నుంచి ఎంవి రమణారెడ్డి రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ (ఎంవిఆర్‌ఆర్‌టిపిపి), విజయవాడలోని నార్లా తాతారావు థర్మల్ పవర్ ప్లాంట్(ఎన్‌టిటిపిఎస్)కు తక్కువ బొగ్గు సరఫరా జరుగుతుందని సిఇఎ పేర్కొంది. రైలుమార్గం ద్వారా జరిగే ఈ సరఫరాలో ఏ మాత్రం ఆటంకం ఏర్పడినా కరెంట్ కోతలతో అంధకారం నెలకొనే ప్రమాదం ఉంది. రైల్వే కూడా సాధారణ రైళ్లకు ఎక్కువగా క్లియరెన్స్ ఇచ్చి గూడ్స్ వాహనాలను ఆపుతోంది. ఇటీవల విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదం వల్ల కృష్ణపట్నం ప్లాంట్‌కు ఒడిషాలోని మహానది గని నుంచి రావాల్సిన బొగ్గు రెండు రోజులు ఆలస్యంగా వచ్చింది. దీంతో సింగరేణి నుంచి తెప్పించి జెన్‌కో అధికారులు సర్దుబాటు చేశారు. ప్లాంట్లకు బొగ్గులో కూడా నాణ్యత లేదనే ఆరోపణలు ఉన్నాయి. బొగ్గులో మట్టి ఎక్కువగా ఉండటంతో అనుకున్నంత ఉత్పత్తి జరగడం లేదు. నిబంధనల ప్రకారం ప్లాంట్ లోడ్ ఫాక్టర్(పిఎల్ఎఫ్) 85శాతం ఉండాలి. అయితే ఎపి జెన్‌కో మూడు ప్లాంట్లు కలిపి 59శాతం మాత్రమే ఉంది. ఎన్‌టిటిపిఎస్ 73శాతం, రాయలసీమ థర్మల్ ప్లాంట్ 71శాతంతో ఉండగా, కృష్ణపట్నం ప్లాంట్ కేవలం 40శాతం మాత్రమే ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రస్తుతం 223 మిలియన్ యూనిట్లు(ఎంయు) విద్యుత్ డిమాండ్ ఉంది. డిస్కంలకు అవసరమైన విద్యుత్ జెన్‌కో నుంచి 91(ఎంయు), కేంద్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి 40(ఎంయు), హిందుజా నుంచి 17ఎంయు, సోలార్ విద్యుత్ 30ఎంయుల వరకు విద్యుత్ వస్తుంది. మిగిలిన కొరతను డిస్కంలు పవర్ ఎక్స్ఛేంజ్ మార్కెట్ నుంచి రూ.9ల వరకు కొనుగోలు చేస్తున్నాయి.

ఏ ప్లాంటులో ఎంత నిలువ ?

ఎన్‌టిటిపిఎస్ ప్లాంట్‌లో ఉత్పత్తి రోజుకు 28,500 మిలియన్ టన్ను(ఎం.టి)లు బొగ్గు అవసరం. ప్రస్తుతం అక్కడ 520,81ఎంటిల బొగ్గు మాత్రమే ఉంది. ఎంవిఆర్‌ఆర్‌టిపిపి రోజుకు 21వేల ఎంటిల బొగ్గు కావాల్సి ఉండగా ప్రస్తుతం అక్కడ 30,337 ఎంటిలు మాత్రమే ఉంది. నెల్లూరులోని కృష్ణపట్నం ప్లాంట్‌కు రోజుకు 19,000ఎంటిల బొగ్గు కావాల్సి ఉండగా, అక్కడ 170560 ఎంటిల నిల్వ ఉంది. రెండో దశ కింద ప్రారంభించిన మూడో యూనిట్‌కు సరిపడ బొగ్గు లేకపోవడంతో రెండు రోజుల క్రితం అక్కడ ఉత్పత్తి నిలిచింది. శనివారమే బొగ్గు వ్యాగన్లు రావడంతో 170560ఎంటిలకు నిల్వ చేరుకుంది. సాంకేతిక కారణంతో ఆ యూనిట్ ఆదివారం కూడా పనిచేయలేదు. ఈ ప్లాంటును కొంత విదేశీ బొగ్గుతో నడపాల్సి ఉండగా, అది అందుబాటులో లేకపోవడంతో స్వదేశీ బొగ్గుతోనే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు చెబుతున్నారు.

ఎందుకీ స్థితి ?

రాష్ట్రాల జెన్‌కో ప్లాంట్లకు సరిపడ బొగ్గును కోల్ ఇండియా సరఫరా చేయడం లేదు. మరోవైపు ఎపి జెన్‌కో యాజమాన్యం వైఫల్యం కూడా కనిపిస్తోంది. రాష్ట్ర జెన్‌కోలకు సరిపడ అందించలేని కోల్ ఇండియా నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టిపిసి)లకు, ప్రైవేట్ ఉత్పత్తి ప్లాంట్లకు అందిస్తుంది. నిబంధనల ప్రకారం 15 రోజులకు సరిపడ బొగ్గు నిల్వలను ప్లాంట్లు సమకూర్చుకోవాలి. ఎన్‌టిపిసి ప్లాంట్లు 15 రోజులకు సరిపడ బొగ్గులో 57శాతం ఉంచుకుంటూ రాష్ట్ర జెన్‌కో ప్లాంట్లలకు మాత్రం తక్కువ స్థాయిలో సరఫరా చేస్తోంది. ప్లాంట్లకు అవసరమైన బొగ్గును జెన్‌కో రైల్ మార్గం ద్వారా తెప్పించుకుంటుంది. రాష్ట్రంలో ఉన్న ప్లాంట్లకు అవసరమైన బొగ్గును జెన్‌కో మహానది బొగ్గు గనుల నుంచి రావాల్సి ఉంది. అయితే మహానదికి బకాయిలు ఉండడంతో అవసరమైన బొగ్గు రావడం లేదు. కేవలం రోజు వారి చెల్లింపులు ద్వారా మాత్రమే బొగ్గును జెన్‌కో తెచ్చుకుంటోంది.

రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రధాని భద్రతా విధులకు వెళ్తున్న ఆరుగురు పోలీసులు మృతి

జైపూర్ : ప్రధాని మోడీ భద్రతా విధుల కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఆరుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. రాజస్థాన్‌లోని జుంజునులో ప్రధాని ఎన్నికల సభకు వెళ్తుండగా, చురు జిల్లా సుజన్‌గఢ్ సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. సుజన్‌గఢ్ సర్కిల్ ఆఫీసర్ (సిఒ) షకీల్ ఖాన్ కథనం ప్రకారం... నాగౌర్‌లోని ఖిన్వ్సర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఆరుగురు, మహిళా పోలీస్ స్టేషన్‌కు చెందిన ఒకరు ప్రధాని ఎన్నికల సమావేశానికి కారులో జుంజును బయల్దేరారు.

సుజన్‌గఢ్ సదర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కనోటా చెక్‌పోస్ట్ సమీపంలో జాతీయ రహదారి-58పై అకస్మాత్తుగా ఓ జంతువు (నీల్‌గాయ్) వాహనం ముందుకు రావడంతో దాన్ని తప్పించేందుకు ప్రయత్నించిన డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయాడు. ఆగివున్న ట్రక్కును ఢీకొట్టాడు. దీంతో, వాహనం ముందు భాగం పూర్తిగా ఛిద్రమై ముక్కలైంది. తెల్లవారు జామున 5:30 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ఖిన్‌సర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎఎస్ఐ రామచంద్ర, కానిస్టేబుళ్ల కుంభారం, సురేష్ మీనా, తానారామ్, మహిళా పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ మహేంద్ర అక్కడికక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, డిజిపి ఉమేష్ మిశ్రా విచారం వ్యక్తం చేశారు.

ఆశలు ఆవిరి

విశ్వవిజేత ఆస్ట్రేలియా

ప్రపంచకప్ ఫైనల్లో భారత్ ఓటమి

ఛేదనలో ట్రావిశ్ హెడ్ మెరుపు సెంచరీ

భారత్ 240/10, ఆస్ట్రేలియా 241/4

కల చెదిరింది. కన్నీరే ఇక మిగిలింది. 2023 ప్రపంచకప్ టీమ్ ఇండియా చేజారింది. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. రికార్డు స్థాయిలో ఆరోసారి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. 2003 ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓడిన టీమ్ ఇండియా.. సొంతగడ్డపై 2023 ప్రపంచకప్ తుది పోరులోనూ నిరాశపరిచింది. ప్రపంచకప్‌లో ఫైనల్లో భారత్‌కు ఇది రెండో ఓటమి. అజేయ ప్రస్థానానికి ఊహించని ముగింపు. ఆతిథ్య జట్టుగా ప్రపంచకప్‌లో వరుసగా పది మ్యాచుల్లో ఎదురులేని విజయాలు సాధించిన టీమ్ ఇండియా.. టైటిల్ ముంగిట ఫైనల్లో బోల్తా పడింది. 'టాస్' పాత్ర గణనీయంగానే ఉన్నప్పటికీ బ్యాట్‌తో ఆతిథ్య జట్టు అంచనాలను అందుకోలేదు. సెమీఫైనల్ వరకు ప్రత్యర్థులను అన్ని విభాగాల్లో చిత్తు చేసిన టీమ్ ఇండియా.. టైటిల్ పోరులో మాత్రం ఆసీస్ చేతిలో అన్ని విభాగాల్లో తేలిపోయింది!.

ఆస్ట్రేలియా సిక్సర్. ఐసీసీ ప్రపంచకప్ టైటిల్ మరోసారి కంగారూ గూటికి చేరుకుంది. అలెన్ బోర్డర్, స్టీవ్ వా, రికీ పాంటింగ్, మైకల్ క్లార్క్ సరసన పాట్ కమిన్స్ నిలిచాడు. ఆస్ట్రేలియా ప్రపంచకప్ టైటిల్ అందించిన తొలి, ఓవరాల్‌గా మూడో బౌలర్, కెప్టెన్‌గా నిలిచాడు. గతంలో పేసర్లు కపిల్ దేవ్, ఇమ్రాన్ ఖాన్ మాత్రమే కెప్టెన్‌గా ప్రపంచకప్ ట్రోఫీని గెలుపొందారు. ఏడాది ఆరంభంలో ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియా.. ఏడాది ఆఖర్లో ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్లో టీమ్ ఇండియాకు తీరని వేదన మిగిల్చింది.

విచార వదనంలో భారత్ ఆటగాళ్లు

క్రికెట్‌కు మతం రంగు పులిమిన మోడీ.. ఓటమికి సిగ్గుపడాలి

- వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్రికెట్‌కు సైతం మతం రంగుపులిమి రాజకీయం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్స్‌లో ఓటమి అనంతరం సిగ్గుపడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో భారత జట్టు ఓటమి అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫైనల్స్‌లో ఇండియన్ క్రికెట్ జట్టు ఓడినా గట్టిగా పోరాడిందని కితాబిచ్చారు. క్రికెట్‌లో రాజకీయ పెత్తనం, బెట్టింగ్‌లను నివారిస్తే ఎలాంటి పోటీలోనైనా సునాయసంగా గెలిచే సత్తా ఇండియా జట్టు సొంతమని అభిప్రాయపడ్డారు. క్రికెట్ క్రీడను కేంద్రమే జూదంగా మార్చేసిందన్నారు.

ఎర్రజెండాకేసే ప్రతి ఓటూ ఓ తూటా

- బయట పోట్లాడుతాం -సభలో నిలదీస్తాం
- ప్రజల గోస పట్టని పార్టీలకెందుకు ఓటెయ్యాలి
- రాజ్యాంగాన్ని పాతాళానికి తొక్కుతున్న బిజెపిని కెసిఆర్ ప్రశ్నించగలరా?
- అమీన్‌పూర్ బహిరంగ సభలో బివి రాఘవులు

లోపలి పేజీలో..

కరువుతో నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.50 వేలు చొప్పున ఇవ్వాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కరువుతో నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.50 వేలు చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే కేంద్రం నుండి కరువు సహాయం కింద రూ.20 వేలకోట్లు రాబట్టాలని అన్నారు. రాష్ట్రంలో 2023 ఖరీఫ్ సీజన్లో వర్షాభావ పరిస్థితుల వల్ల 350కు పైగా మండలాల్లో కరువు ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం 103 మండలాల్లో మాత్రమే కరువు తీవ్రతను గుర్తించిందన్నారు. రాష్ట్రంలోని కరువు పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, నిధులు రాబట్టడంలోనూ, కేంద్ర బృందాలను రాష్ట్ర పర్యటనకు ఆహ్వానించి కరువు పరిస్థితులు వివరించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం వహిస్తున్నదని పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ ఏడాది సంభవించిన కరువును ప్రకృతి విపత్తుగా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.20 వేల కోట్లు రాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా మరో రూ.20 వేల కోట్లు సహాయం జోడించి, కరువు సహాయం కింద ఎకరాకు రూ.50 వేలు చొప్పున రైతులకు ఇవ్వాలన్నారు. వలసలను అరికట్టేందుకు వ్యవసాయ కార్మికులకు ఒక్కో కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు.

చరిత్రను వక్రీకరించడం తగదు

- రైతాంగ సాయుధ పోరాటంలో ఎగిసిన భూ ఉద్యమం
- వినోబాభావే ఉద్యమంగా ప్రచురించడం సరైందికాదు
- ఆంధ్రజ్యోతి కథనంపై వామపక్షాల ఖండన

లోపలి పేజీలో..

మృత్యువుతో అంతులేని పోరాటం

- తొమ్మిది రోజులుగా సొరంగంలోనే 41 మంది కార్మికులు
- పనిచేయని డబుల్ ఇంజిన్ సర్కారు
- పట్టించుకోని మీడియా
- రెండురోజులుగా నిలిచిపోయిన వెలికితీత పనులు
- ఆశలు వదులుకుంటున్న బంధువులు

కార్మికులు చిక్కుకుపోయిన సొరంగం వద్ద స్థానికులు, సహాయక సిబ్బంది

డెహ్రాడూన్ : వారు కార్మికులు...రెక్కాడితే కాని డొక్కాడని కష్టజీవులు. పొట్ట నింపుకోవడం ఎంతటి కష్టానికైనా వెనుతీయని శ్రమజీవులు! ఒకరు ఇద్దరుకాదు...41 మంది! ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో కుప్పకూలిన సిల్క్యారా సొరంగంలో చిక్కుకుపోయి నేటికి (సోమవారానికి) తొమ్మిది రోజులు! అప్పటి నుండి నేటి వరకు మృత్యువుతో అంతులేని పోరాటం చేస్తున్నారు. సహాయచర్యలు నత్తనడకన సాగుతుండటంతో మరెన్ని రోజులు ఈ పోరాటం చేయాల్సివస్తుందో తెలియని స్థితి! దీంతో టన్నెల్ దగ్గరకు పెద్ద సంఖ్యలో చేరుకున్న వారి బంధుమిత్రులు ఆశలు వదులుకుంటున్నారు!

అక్కడున్నది డబుల్ ఇంజిన్ సర్కారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ తామే అధికారంలో ఉంటే అద్భుతాలు సృష్టిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షాలు దేశమంతా చెప్పుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ డబుల్ ఇంజిన్ సర్కారే కార్మికులను వెలికితీసే విషయంలో నత్త నడకన సాగుతోంది. ఏం చేయాలో తెలియక రెండు రోజుల నుండి వెలికితీత పనులు సైతం నిలిపివేసింది. ఆదివారం ప్రారంభమవుతాయని భావించినా అరకొరా తప్ప పెద్దగా ముందుకు సాగింది లేదు. ప్రత్యామ్నాయ ప్రణాళికల గురించే అధికారులు ఆలోచిస్తున్నారు. ఆ ప్రణాళికలను సక్రమంగా అమలు చేసినా కార్మికులను వెలికితీయడానికి మనో నాలుగైదు రోజులు పడుతుందని అంచనా! ఇటువంటి ఉపద్రవాలు చోటుచేసుకున్నపుడు అవసరమైన సాంకేతికత, నిపుణుల కోసం అనేక దేశాలు అంతర్జాతీయ సాయం తీసుకున్నాయి. ప్రధానమంత్రి, హోంమంత్రిలు ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో పూర్తిస్థాయిలో నిమగ్నమైన సంగతి తెలిసిందే. ప్రమాదం జరిగిన ఎనిమిదవరోజైన ఆదివారం పిఎంఒ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే, కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీతో పాటు కొందరు పిఎంఒ కార్యాలయ అధికారుల పర్యటన తప్ప ఆదివారం కొత్తగా పడిన

మిగతా 5లో

కులగణనకు సిద్ధమవుతోన్న ఉద్యోగులు

- నేటి నుంచి 4 రోజులు శిక్షణ

లోపలి పేజీలో..

చికెన్ ధరలు నేలచూపులు

- రిటైల్ రూ.180, లైవ్ రూ.140
- కార్తీక మాసం ఎఫెక్ట్
- నష్టాల బాటలో పౌల్ట్రీ రైతులు

లోపలి పేజీలో..

ట్యాంకర్ల నీటితో పొగాకు నాట్లు

- కరువు దెబ్బతో నెల ఆలస్యంగా ప్రారంభం
- 1.40 లక్షల ఎకరాలకుగానూ 47,599 ఎకరాల్లోనే సాగు
- బోర్డు అనుమతిచ్చిన 142 మిలియన్ కిలోల పంట అనుమానమే!

కొండపిలో ట్యాంక్‌తో నీటిని తీసుకొచ్చి బిందెలతో పొగ మొక్కలను తడుపుతున్న రైతులు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

పొగాకు సాగుపై కరువు దెబ్బ తీవ్రంగా ఉంది. వర్షాభావంతో ఖరీఫ్ పంటలన్నీ చేజారాయి. అరకొరగానే చేతికందే పరిస్థితి కనిపిస్తోంది. రబీలో కీలకమైన వాణిజ్య పంటగా ఉన్న పొగాకు సాగుకూ ఇప్పుడు వర్షాభావం సవాలుగా మారింది. 1.40 లక్షల ఎకరాలకుగానూ 47,599 ఎకరాల్లోనే ప్రస్తుతం నాట్లు పడ్డాయి. ఇప్పటికే నాట్లు నెల రోజులు ఆలస్యమయ్యాయి. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి కొండపి, టంగుటూరు ప్రాంతాల్లో నాట్లు వేస్తున్నారు. పశ్చిమాన పొదిలి, కనిగిరి ప్రాంతాల్లో ముందుగానే వేస్తారు. ఇప్పుడు అక్కడ అదును దాటిపోయింది. నాట్లు పడలేదు. పంట సాగును తాము విరమించుకున్నట్టేనని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడా చుక్క నీరు లేదు. వర్షాలు పడిన ప్రాంతాల్లో భూమి కొంత పదునైంది. ఇప్పటికే దున్నిన పొలాల్లో ట్యాంకర్లతో నీటిని తెచ్చి నాట్లు వేస్తున్నారు. వాస్తవానికి ఈ సమయానికి 80 శాతం వరకూ నాట్లు పూర్తి కావాలి. జనవరిలో క్యూరింగ్‌కు రావాలి. పశ్చిమ ప్రాంతంలో ఈ సమయానికి తోటలు పెరిగి పచ్చాకు కూడా తీసేవాళ్లు. ఇప్పుడు అక్కడ సాగుపై ఆశల్లేవు. ప్రత్యామ్నాయం ఏమిటనే దానిపై ఆలోచిస్తున్నారు. వారం రోజుల క్రితం కొద్దిపాటి జల్లులు పడిన ప్రాంతాల్లో ఇప్పుడు నాట్లు వేస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి నాట్లు పెద్దగా పడకపోయినా ఈ నెలలో వర్షాలు కురిశాయి. దీంతో, నవంబరు చివరి నాటికి నాట్లు ముమ్మరమయ్యాయి. ప్రస్తుతం వర్షాల జాడ లేదు. కాలువలు, చెరువులు ఎక్కడా నీరు లేదు. నాట్లు నత్తనడకన సాగుతున్నాయి. పొగాకు సాగుకు ఎకరాకు రూ.20 వేలు వరకూ ఖర్చవుతుంది. ట్యాంకర్లతో నీటిని తెచ్చి నాట్లు వేయాల్సి వస్తుండడంతో రూ.2 వేల వరకూ అదనంగా ఖర్చవుతోందని రైతులు వాపోతున్నారు. పొగాకు నారు మూట రూ.2 వేలు అమ్ముతోంది. నాట్లు ఆలస్యమైనందున నారుమడులు కూడా దెబ్బతిన్నాయి.

ఈ ఏడాది 142 మిలియన్ కిలోలకు అనుమతి

పొగాకు బోర్డు రాష్ట్రంలో ఈ ఏడాది 142 మిలియన్ కిలోల పంటకు అనుమతి ఇచ్చింది. ఈ విషయాన్ని ఇటీవల జిల్లాను సందర్శించిన పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ వెల్లడించారు. రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పొగాకు రైతులకు అన్ని విధాలా బోర్డు నుంచి సహాయసహకారాలు అందిస్తామని చెప్పారు. గతేడాది పొగాకు ఎగుమతుల ద్వారా రూ.950 కోట్లు విదేశీ మారకద్రవ్యం వచ్చిందని, ఈ ఏడాది రూ.1200 కోట్ల నుంచి రూ.1400 కోట్ల వరకూ రావచ్చనే అంచనాల్లో

మిగతా 2లో

సంగం డెయిరీ డైరెక్టర్ అరెస్టు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పాల ఉత్పత్తిదారులకు బోనస్ చెల్లింపుల్లో ఏర్పడిన వివాదంలో గుంటూరు జిల్లా సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి శ్రీనివాస్‌తోపాటు ఇద్దరు ఉద్యోగులను చేబ్రోలు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని సంగం డెయిరీ కార్యాలయం వద్ద ఏలూరు జిల్లా పెదవేగి మండలం జానంపేటకు చెందిన పాడి రైతు ముసునూరి రాముకు, డెయిరీ సిబ్బందికి మధ్య ఈ నెల 15న ఘర్షణ చోటుచేసుకుంది. బోనస్ చెల్లింపుల్లో వ్యత్యాసాన్ని ప్రశ్నించిన తనపై డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, పలువురు డైరెక్టర్ల ప్రోద్బలంతో దాడి జరిగిందంటూ పోలీసులకు రాము ఫిర్యాదు చేశారు. ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సహా 15 మందిపై పోలీసులు 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. డైరెక్టర్ గొల్లపల్లి శ్రీనివాస్‌ను, డెయిరీ ఉద్యోగులను ఇద్దరిని ఆదివారం అరెస్టు చేశారు. నరేంద్రకుమార్ అజ్ఞాతంలో వెళ్లిపోయారు.

చరిత్రను వక్రీకరించడం తగదు

- రైతాంగ సాయుధ పోరాటంలో ఎగిసిన భూ ఉద్యమం
- వినోబాభావే ఉద్యమంగా ప్రచురించడం సరైందికాదు
- ఆంధ్రజ్యోతి కథనంపై వామపక్షాల ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముందుకు తెచ్చిన భూ ఉద్యమాన్ని వక్రీకరించేలా ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించడం తగదని వామపక్ష పార్టీలు ఖండించాయి. చరిత్రను వక్రీకరించేలా కాకుండా వాస్తవాలను పత్రికలో ప్రచురించాలని కోరాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆదివారం ఆంధ్రజ్యోతి ఎడిటరుకు లేఖ రాశారు.

ఈ నెల 19న ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాష్ట్రంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన భూ పంపిణీ కార్యక్రమాన్ని విమర్శిస్తూ భూములపై బొంకులు అనే కథనంలో ఆంధ్రప్రదేశ్‌లో వినోబాభావే కాలంలోనే భూ పంపిణీ జరిగినట్లు రాశారని తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధాలను సరిదిద్దే పేరుతో మరో అబద్ధాన్ని మీరు ప్రచారంలోకి తీసుకురావడం సరైందికాదని అన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముందుకు తెచ్చిన భూ పంపిణీ కార్యక్రమాన్ని దెబ్బతీసేందుకు భూస్వాముల ప్రయోజనాల కోసమే వినోబాభావే భూదాన కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. భూస్వాములు దయతో భూములు ఇచ్చినట్లు ప్రకటించినా వాటిని ఎక్కడా పేదలకు పంచలేదని, ఆ భూములు ఇప్పటికీ భూస్వాముల ఆధీనంలోనే ఉన్నాయని తెలిపారు. ఎవరికీ చెందని ప్రభుత్వ భూములను కూడా భూదానం పేరుతో పంచినట్లు ప్రచారం చేశారు తప్ప ఒక్క ఎకరా కూడా పేదలకు దక్కలేదన్నారు. రాష్ట్రంలో 1940 నుంచి 15 ఏళ్లపాటు మళ్లీ 1960 నుంచి 1970 వరకు అంటే పదేళ్ల పాటు రాష్ట్రంలో వామపక్షాల ఆధ్వర్యంలో పెద్దయెత్తున భూ పోరాటాలు జరిగాయని తెలిపారు. చల్లపల్లి జమీందారు భూములకు సంబంధించిన భూ పోరాటాల్లో కమ్యూనిస్టులు ముఖ్య పాత్ర అద్వితీయమైనదని గుర్తుచేశారు.

పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు తదితర నాయకులు ఈ పోరాటాలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించారన్నారు. పేదలు ఎర్రజెండాలు నాటి ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. 1960 నుంచి నూజివీడు తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు దాసరి నాగభూషణరావు, చలసాని జగన్నాథరావు, బొడ్డు దేవసుందరం నాయకత్వంలో బంజర భూముల ఆక్రమణ ఉద్యమాన్ని నిర్వహించి వేలాది ఎకరాల బంజరు భూములను పేదలకు పంపిణీ జరిగిందన్నారు. ఈ భూములకు 1969, 1970లలో ఆనాటి కలెక్టరు ఆర్కే వేపా 15 వేల ఎకరాలకు అసైన్‌మెంట్ పట్టాలను మంజూరు చేశారన్నారు. ఆ పోరాటాల ఫలితంగా పేదల చేతుల్లో వున్న ఆ భూములకు అనివార్యంగా తరువాత కాలంలో వచ్చిన ప్రభుత్వాలు పట్టాలు పంపిణీ చేశాయని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా నూజివీడులో ఆ భూములకు శాశ్వత పట్టాలను మంజూరు చేయటం మాత్రమే జరిగిందన్నారు. రాష్ట్రంలో భూ పంపిణీపై వాస్తవాలు ఇవి కాగా, కమ్యూనిస్టులు చేసిన పోరాటాన్ని విస్మరించి భూ పంపిణీ వినోబాభావే సాగించినట్లు చెప్పటం చరిత్రను వక్రీకరించటమే అవుతుందని అన్నారు.

రాష్ట్రంలో వినోబాభావే భూములు ఎక్కడ పంచారో, అవి ఇప్పుడు ఎవరి స్వాధీనంలో ఉన్నాయో ఒక ఉదాహరణ ఇచ్చినా సంతోషిస్తామన్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల అసైన్డ్ భూములు పేదల చేతుల నుంచి అన్యాక్రాంతమైనా ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదన్నారు. దురాక్రమణదారులకు గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం కూడా కొమ్ముకాశాయని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చిన జిఓ కూడా అన్యాక్రాంతమైన భూములకు చట్టబద్ధత కల్పించడానికి తప్ప పేదలకు పెద్దగా ఉపయోగపడదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తానే భూములు పంచినట్లు అబద్ధాలు చెబుతున్నారని, మీరు రాసింది వాస్తవమని, అయితే ఆ భూములు పోరాటాల ద్వారా ఎలా పేదల చేతుల్లోకి వచ్చాయో అనే వాస్తవాలను కూడా ప్రజలకు అందించాలని కోరారు.

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

'ఉక్కు' పరిరక్షణ ప్రతి ఒక్కరి ధ్యేయం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగ సంస్థ అయిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ధ్యేయంగా ఉండాలని సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1011వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం యువత నడుం బిగించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఉంటేనే రిజర్వేషన్లు అమలవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు బొండా తౌడన్న, సభ్యులు సవరపు సత్యనారాయణ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

యువ కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి -మేడికొండూరు (గుంటూరు జిల్లా)

కాల్వల నుండి సాగు నీరు అందకపోవడం, తీవ్ర వర్షాభావం నేపథ్యంలో పైరు ఎండిపోవడంతో తట్టుకోలేక యువ కౌలురైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన గుంటూరు జిల్లా మేడికొండూరు మండలంలో ఆదివారం వెలుగు చూసింది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వెలవర్తిపాడుకు చెందిన ఓర్సు సోమయ్య (33) నాలుగున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి సాగు చేశారు. ఈ పొలాలకు నాగార్జునసాగర్ బ్రాంచ్ కెనాల్ నుండి సాగు నీరు పరిమితంగానే విడుదల కావడంతో నీరు సరిగా అందక పైరు ఎండిపోయింది. దీంతో సోమయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. పంటల సాగు నిమిత్తం రూ.3 లక్షలకుపైగా అప్పులయ్యాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి పొలానికి వెళ్లి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. సోమయ్య కుటుంబాన్ని కౌలు రైతు సంఘం నాయకులు బి.రామకృష్ణ, షేక్ ఇమామ్, సాదిక్ పరామర్శించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయం చేయాలని కోరారు.

'అచ్చెన్న' ప్రకటన ఉపసంహరించుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మద్యం నిషేధం అసాధ్యమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ప్రకటనను ఉపసంహరించుకోవాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టిడిపి ప్రభుత్వం 2014లో మద్య నియంత్రణ చేస్తామని హామీ ఇచ్చి ఉల్లంఘించిందన్నారు. 2017-18లో రాష్ట్రంలో మహిళల ఆందోళన తర్వాతే.. మహిళలు అనుమతించిన చోటే షాపులు మూసివేయాలని ఆనాటి టిడిపి కేబినెట్ తీర్మానించినట్లు పేర్కొన్నారు. మహిళల ఆందోళన ఫలితంగానే జగన్ మద్య నిషేధం హామీ ఇచ్చారన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఝాన్సీ లక్ష్మీభాయి స్ఫూర్తితో ముందుకు

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాతృదేశం కోసం బ్రిటీషర్లతో పోరాడి, ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన ఝాన్సీ లక్ష్మీభాయిని ఎల్లవేళలా స్మరించడమే కాకుండా, ఆమె స్ఫూర్తిని మనం పుణికి పుచ్చుకోవాలని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సూచించారు.

ఈ మేరకు ఆదివారం ఆమె జయంతి సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళల శక్తి సామర్థ్యాలు చాటే క్రమంలో ఝాన్సీ లక్ష్మీభాయిలోని తెగువను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ట్యాంకర్ల నీటితో పొగాకు నాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నామని తెలిపారు. కరోనా వల్ల అనేక దేశాల్లో పొగాకు పంట తగ్గింది. దీంతో, ఎగుమతులు పెరిగాయి. ఈ ఏడాది పంట అనుమతించిన మేరకు కూడా పండుతుందా? లేదా? అనేది సందిగ్ధంగానే మారింది. గతేడాది గరిష్ట ధర కిలోకు రూ.275 వరకూ లభించింది. గతంలో ఉన్న సీలింగ్ వ్యవహారం కూడా తొలగిపోయింది. వేలం సజావుగా నడిచింది. రైతులకు సగటు ధర కిలోకు రూ.230 వచ్చింది. దీంతో, పొగాకు రైతులు ఈ ఏడాది ఆశాజనకంగా ఉంటుందని భావించారు. అయితే, వర్షాభావం వారి ఆశలపై నీళ్లుజల్లింది.

సాగర్ జలాలు లేకపోవడంతో ఆరుతడికీ గండమే!

ప్రకాశం రీజియన్ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 80 మిలియన్ కిలోల పొగాకు పండుతుంది. సాగర్ జలాలతోనే ఆరుతడి వేస్తారు. ఈ ఏడాది సాగర్ రిజర్వాయర్‌లో నీరు లేదు. మాగాణితోపాటు ఆరుతడికీ నీరివ్వలేమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

గుండ్లకమ్మలోనూ నీరు లేదు. దీంతో, చాలామంది రైతులు పొగాకు సాగును వదిలేశారు. ఇంజన్లతోనూ, ట్యాంకర్లతోనూ నీటిని తెచ్చి తోటలను తడపాలన్నా సాధ్యం కాని పరిస్థితులున్నాయి. కనిగిరి వేలం కేంద్రం పరిధిలో ఇప్పటికే పొగాకు సాగును వదిలేశారు. ఈ నెలలో వర్షాలు కురిసినా ఆరుతడికి నీరు ఎలా? అనే ఆందోళనలో రైతులు ఉన్నారు.

ఎర్రజెండాకేసే ప్రతి ఓటూ ఓ తూటా

- బయట పోట్లాడుతాం – సభలో నిలదీస్తాం
- ప్రజల గోస పట్టని పార్టీలకెందుకు ఓటెయ్యాలి
- రాజ్యాంగాన్ని పాతాళానికి తొక్కుతున్న బిజెపిని కెసిఆర్ ప్రశ్నించగలరా?
- అమీన్‌పూర్ బహిరంగ సభలో బివి రాఘవులు

బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి.రాఘవులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఎర్రజెండాకు వేసే ప్రతి ఓటూ పాలకుల గుండెల్లో పేలే తూటా లాంటిదని, ప్రజల సమస్యలపై పోరాడేందుకు మరింత శక్తిని పెంచేందుకు దోహదపడుతుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. సమస్యలపై బయట పోట్లాడుతామని, చట్టసభల్లో మాట్లాడుతామని అని స్పష్టం చేశారు. ఓట్లు, సీట్లు వచ్చినా రాకపోయినా కార్మిక వర్గం, పేదల ప్రయోజనాల కోసం పోరాడుతామని తెలిపారు. ఇతర పార్టీలేవైనా బయటా, చట్టసభల్లో ప్రజల గురించి ఆలోచిస్తాయా? అని ప్రశ్నించారు. పటాన్‌చెరు నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జె.మల్లికార్జున్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సంగారెడ్డి జిల్లాలోని బీరంగూడ మండే మార్కెట్‌లో నాయకులు నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో రాఘవులు మాట్లాడారు. 'మేముండడానికి ఇళ్లుఇచ్చారా? మేం బతకాడిని మా జీతం పెంచారా? పిఎఫ్, ఇఎస్‌ఐ సదుపాయం కల్పించారా? మా పేదరికం పోయేందుకు ఆలోచించారా? ఇన్నాళ్లు పాలించి ఏం చేశారో చెప్పండి' అంటూ పాలక పార్టీలను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశ్రమల యజమానులకు సాయపడడం తప్ప ఏనాడైనా కార్మికులు, పేదల గురించి మాట్లాడని, పోరాడని పార్టీల అభ్యర్థులిచ్చే నోట్ల కట్టలకు ఆశపడితే మన భవిష్యత్ నాశనమై గోస పడతామన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల పరంగా వేరైనప్పటికీ విధానాల పరంగా రెండు ఒక్కటేనని వివరించారు. రాష్ట్రంలో ఏర్పడే ప్రభుత్వాలు బిజెపి అమలు చేసే ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేయకుండా అడ్డుపడగలవా? అని ప్రశ్నించారు. ఎత్తైన అంబేద్కర్ విగ్రహం పెడితే చాలదని, ఆయన ఆశయాలను దెబ్బతీస్తోన్న బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. బిజెపికి కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు తప్ప కార్మికుల సమస్యలు పట్టవని తెలిపారు. అదానీ లక్షల కోట్ల రూపాయల నల్లధనాన్ని బయటకు పంపించి తెల్లధనంగా మార్చుకున్నట్టు ఆధారాలు బయటపడినా విచారణ సంస్థలు మాత్రం ఆయనకు క్లీన్ చీట్ ఇవ్వడం శోచనీయమన్నారు. బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ చరిత్రను అర్థం చేసుకోవాలని, నిజాయితీగా పనిచేసే ఎర్రజెండా అభ్యర్థికి ఓటేయాలని ప్రజలను కోరారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో లక్షలాది మంది కార్మికులు ఉన్నారని, వీరికి కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ వంటి సదుపాయాల కోసం సిపిఎం నికరంగా పోరాడిందన్నారు. కార్మికులు, ఉద్యోగులు, పేదల కష్టాలు తెలిసిన మల్లికార్జున్‌ను గెలిపించుకోవడం ద్వారా ప్రభుత్వంతో కొట్లాడి సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

హామీలు అమలు చేయండి

- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపాలిటీల్లోని ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమ, మంగళవారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల వద్ద ధర్నాలు, వంటా వార్పు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాగభూషణం, కె ఉమామహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగరాల సుందరీకరణ, అమృత పట్టణాలు, స్వచ్ఛ భారత్ వంటి ఆకర్షణీయమైన పేర్లు పెట్టి కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి గత ఎన్నికల ముందే అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగులను పర్మినెంటు చేస్తామని గత ఎన్నికల ముందు జగన్ హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లయినా వాటిని అమలు చేయలేదన్నారు. సోమ, మంగళవారాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో మున్సిపల్ కార్మికులు పెద్దయెత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నిజామాబాద్ అర్బన్ ఎన్నికల అభ్యర్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ అర్బన్ నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన యమగంటి కన్నయ్య గౌడ్ (36) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం నిజామాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కన్నయ్య గౌడ్ మొబైల్‌ను దుండగులు హ్యాక్ చేసి ఆయనకు సంబంధించిన వీడియోలను మార్ఫింగ్ చేసి అతనికి పంపించారు. డబ్బులు చెల్లిస్తే వీడియోలు తీసేస్తామని హ్యాకర్లు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో కన్నయ్యగౌడ్ మనస్తాపానికి గురయ్యారు. నిజామాబాద్ సాయినగర్‌లోని తన ఇంట్లో ఆదివారం వేకువజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ నుంచి ఆయన బరిలో నిలిచారు.కాగా ఈ నియోజకవర్గం నుంచి టిఆర్ఎస్ తరుపున మహేష్ బిగాల, కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీ, బిజెపి తరుపున ధన్‌పాల్ పోటీలో ఉన్నారు.

రోడ్డు షోలో మాట్లాడుతున్న మధు

కెసిఆర్ పాలనకు కాలం చెల్లింది

- మాజీ ఎంపి, సిపిఎం ఎపి మాజీ కార్యదర్శి మధు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ కుటుంబ పాలనకు కాలం చెల్లిందని సిపిఎం మాజీ ఎంపి, ఆంధ్రప్రదేశ్ మాజీ కార్యదర్శి పి.మధు విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో మునుగోడు సిపిఎం అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డి గెలుపు కోసం నిర్వహించిన రోడ్డు షోతో చౌటుప్పల్ పట్టణకేంద్రం ఎరుపుమయంగా మారింది. మహిళల కోలాటాలు, కళాకారుల డప్పు చప్పుళ్లు, ఆటపాటలు, వంద మీటర్ల ఎర్రజెండా చేతబూని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, మహిళలతో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. ఈ రోడ్డు షో చిన్నకొండూరు చౌరస్తా వరకు కొనసాగింది. జిల్లా కార్యదర్శి ఎమ్‌డీ జహంగీర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ బహిరంగసభలో మధు పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని, నిజాయితీకి పట్టం కట్టాలని కోరారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రూ.18వేల కోట్ల కాంట్రాక్టుకు బిజెపికి అమ్ముడుపోయారని.. మునుగోడు ఉపఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులే విమర్శించారని గుర్తుచేశారు. రంగులు మార్చే ఊసరవెల్లి రాజగోపాల్‌రెడ్డిని చిత్తుగా ఓడించేందుకు మునుగోడు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గిట్టుబాటు ధర కోసం రైతు ఉద్యమాలు నిర్వహిస్తే మోడీ రైతులపై లాఠీఛార్జి చేయించారని ధ్వజమెత్తారు. కార్మికుల హక్కులను బిజెపి కాలరాసిందన్నారు. అలాంటి మోడీ ప్రభుత్వానికి కెసిఆర్ వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. అవకాశవాద, అవినీతి, మతతత్వ పార్టీల అభ్యర్థులను ఓడించాలన్నారు. ఈ ప్రాంత ప్రజల పక్షాన పోరాటాలు చేసే దోనూరి నర్సిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎమ్‌డీ జహంగీర్, పార్టీ నాయకులు బండ శ్రీశైలం, బూర్గ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదంతో బిజెపి అవినీతిలో బిఆర్ఎస్

- పేదల పక్షాన నిలబడే సిపిఎం అభ్యర్థులకు ఓటెయ్యండి
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్

బహిరంగ సభలో మాట్లాడుతున్న విజయరాఘవన్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఈ ఎన్నికల్లో మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తోన్న బిజెపి, అవినీతిలో మునిగిపోయిన బిఆర్ఎస్, శాసనసభ సీట్లనే గుండుగుత్తగా అమ్ముకుంటున్న కాంగ్రెస్ పార్టీ పోటీలో ఉన్నాయని, ఆ పార్టీల అభ్యర్థులు సంపాదించిన డబ్బుతో ఓట్లుకొని మరోసారి అధికారంలోకి రావాలని యత్నిస్తున్నాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ అన్నారు. పేదల పక్షాన నిలబడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నల్లగొండ జిల్లా నేరేడుచర్ల మండలంలోని మేడారం గ్రామంలో సిరికొండ శ్రీను అధ్యక్షతన నిర్వహించిన హుజూర్‌నగర్ సిపిఎం అభ్యర్థి మల్లు లక్ష్మి ప్రచార యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తున్నామని చెబుతున్నారని, కానీ మనం చీకటిలో మాట్లాడుతున్నామని అన్నారు. కేరళలో 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. కేరళలో ఎర్రజెండా ప్రభుత్వం పేదరికం లేకుండా చేయడంలో విజయవంతమైందన్నారు. విద్య, వైద్య రంగాల్లో ఘననీయమైన పురోగతి సాధించి దేశంలో నెంబర్ వన్ స్థానంలో ఉందని తెలిపారు. 99 శాతం కుటుంబాలకు భూమి ఉందని, 94 శాతం ప్రజలకు ఇళ్లుఉన్నాయని, మరో నాలుగు శాతం మంది పేదలకు రాబోయే మూడేళ్లలో ఇళ్లు నిర్మించే కేరళ వామపక్ష ప్రభుత్వం కార్యక్రమం చేస్తుందని వివరించారు. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు. తెలంగాణలోనూ రాజకీయ ప్రత్యామ్నాయం రావాలంటే ఎర్రజెండా నాయకత్వంలోని 19 మంది అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా శాసనసభకు పంపిస్తే పేదలపక్షాన పోరాడి వాణి వినిపిస్తారన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ, హుజూర్‌నగర్ నియోజవర్గంలో కాంగ్రెస్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బిఆర్ఎస్ నుండి సైదిరెడ్డి ఇద్దరిలో ఏ ఒక్కరూ మల్లు లక్ష్మితో సరితూగగలరా? అని ప్రశ్నించారు. మల్లు లక్ష్మి చిన్నతనం నుండే పోరాటాల్లో పాల్గొన్నారని, మల్లు స్వరాజ్యం వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని జైలుకు వెళ్లారని, లాఠీ దెబ్బలు తిన్నారని, ప్రజల పక్షాన పోరాడారని వివరించారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అరిబండి లక్ష్మీనారాయణ, జూలకంటి రంగారెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప మరొకటి లేదని తెలిపారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సాగర్, సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు

- కాంగ్రెస్‌కు అవకాశమివ్వండి..
- ఖానాపూర్, ఆసిఫాబాద్ సభల్లో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణను ముఖ్యమంత్రి కెసిఆర్ పూర్తిగా దోచుకుంటున్నారని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన లక్ష్యం.. ప్రజల ఆకాంక్షలు నెరవేరడంలేదని దుయ్యబట్టారు. పెద్ద కంపెనీలతో దోస్తానీ చేస్తూ దేశాన్ని బిజెపి నాశనం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో మోడీ, రాష్ట్రంలో కెసిఆర్ ప్రజల రక్తం తాగుతున్నారని ఘాటుగా విమర్శించారు. ఒక్కసారి కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించాలని.. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్, కుమురంభీం ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభల్లో ప్రియాంక గాంధీ పాల్గొని మాట్లాడారు. ఖానాపూర్, నిర్మల్, ఆసిఫాబాద్, సిర్పూర్ కాంగ్రెస్ అభ్యర్థులు వెడ్మ బొజ్జు, శ్రీహరిరావు, శ్యామ్‌నాయక్, రావి శ్రీనివాస్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరాగాంధీ చేసిన మంచి పనులే ఇప్పటికీ ప్రజల మదిలో ఉండేలా చేశాయని గుర్తుచేశారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను కాంగ్రెస్ పార్టీ అంతే బాధ్యతతో నిర్వర్తించిందన్నారు. ఆదివాసీ, గిరిజను సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులు చూసి ఆనాడు కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని.. కానీ ఏ ఉద్దేశంతో ఇచ్చిందో ఆ లక్ష్యం నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగుల సమస్యలు తీరలేదని.. కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని విమర్శించారు.

ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చి కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై మాట్లాడలేదని.. బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటేనని ఆరోపించారు. కెసిఆర్ ప్రభుత్వంలో నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగాయని, ధరణి పోర్టల్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. తెలంగాణలో రైతులు, కూలీలు, కార్మికులు అందరికీ అన్యాయం జరిగిందని వివరించారు. రైతుల కోసం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు కెసిఆర్ మద్దతు తెలిపారని గుర్తుచేశారు. బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటేననే విషయం ప్రజలు గ్రహించాలన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రియాంక గాంధీ

అధికారంలోకి రాగానే రుణమాఫీ

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని, రూ.10లక్షల ఇన్సురెన్సుతో యువవికాసం పథకాన్ని తీసుకొస్తామన్నారు. ప్రతి జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణం చేపడతామని, కర్ణాటక తరహాలో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, అభయహస్తం కింద రూ.12లక్షలు చెల్లిస్తామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే, మహారాష్ట్ర మాజీ సిఎం అశోక్‌చవాన్, ఎఐసిసి కార్యదర్శి రోహిత్‌చౌదరి, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాష్‌రాథోడ్, రాజురా ఎమ్మెల్యే సుభాష్‌దోబే, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు పాల్గొన్నారు.

గిరిజనులకు ద్రోహం చేసేలా బోయలకు ఎస్‌టి హోదా ఇవ్వడం తగదు

- రాష్ట్రపతికి పోస్టు కార్డులు
- అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని సంప్రదాయంగా అడవుల్లో, కొండల్లో నివసించే గిరిజనులకు ద్రోహం చేసేలా ప్రభుత్వం మైదాన ప్రాంతంలో నివసించే బోయలకు ఎస్‌టి హోదా ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మాణం చేయడం తగదని అఖిల భారత గిరిజన సంఘం పేర్కొంది. లక్షలాది మంది గిరిజనులకు ద్రోహం చేసే బోయలకు ఎస్‌టి హోదా బిల్లును అమోదించరాదంటూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పోస్టు కార్డులు పంపారు. ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన గిరిజన జాబితాలో అనర్హులైన బోయ, వాల్మీకులను చేర్చుట-ప్రభుత్వ తీరుతెన్నులు అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పివి రమణ, రాష్ట్ర ఛైర్మన్ ఏకశిరి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ జ్యోతిలాల్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు బి బాలు నాయక్, ప్రధాన కార్యదర్శి డి ప్రభాకర్, నాయకులు బ్రహ్మ, బాలాజి, రామచంద్రయ్య తదితరులు మాట్లాడారు. బోయలను ఎస్‌టి జాబితాలోకి చేర్చాలనే రాష్ట్ర ప్రభుత్వం రెండోసారి అసెంబ్లీలో తీర్మాణం చేసి పార్లమెంటుకు పంపడం సరైంది కాదన్నారు. గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం ఎలాంటి శాస్త్రీయ పరిశోధనలు లేకుండానే కేవలం ఓట్ల రాజకీయం కోసం బోయలను వాల్మీకుల్లో చేర్చేందుకు తహతహలాడుతున్నాయని విమర్శించారు. మైదాన ప్రాంతంలో వుండే 40 లక్షల మంది బోయలకు ఎస్‌టి హోదా ఇస్తే ఎలాంటి సౌకర్యాలు లేని అడవులు, గుట్టలు, వాగుల్లో నివసించే 27 లక్షల మంది గిరిజనుల పరిస్థితి ఏమవుతుందో ఆలోచించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన సౌకర్యాలన్నీ గిరిజనులకు దక్కకుండా బోయలకు దక్కే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. బోయలకు ఎస్‌టి హోదా ఇస్తే సంప్రదాయ గిరిజనులు మరింత వెనుకబాటుకు గురయ్యే ప్రమాదం వుందని అన్నారు. ఇప్పటికీ గిరిజనుల ఆయుప్రమాణ సగటు 45 సంవత్సరాలేనని అన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారిందన్నారు. చిన్నపాటి జ్వరం వస్తే ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. అలాగే నల్లమల ప్రాంతంలోని చెంచులు కూడా వేట ప్రధాన వృత్తిగా అనాగరికమైన జీవనాన్ని గడుపుతున్నారని అన్నారు. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో జీవిస్తున్న గిరిజనులను మరింత దిగజార్చేలా వున్న ఈ బిల్లును పార్లమెంటు ఆమోదించకుండా రాష్ట్రంలోని ప్రతి గిరిజనుడూ రాష్ట్రపతికి పోస్టుకార్డు ఉద్యమం ద్వారా విజ్ఞప్తి చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఈ ఉద్యమాన్ని మరింత విస్తృతం చేసేందుకు గిరిజనులంతా ఐక్యం కావాలన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- కేంద్ర మంత్రి శోభాకరంధ్లాజీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించి ముందుకు సాగాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శోభాకరం ధ్లాజీ అన్నారు. సత్యసాయిబాబా 98వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రితోపాటు హెచ్‌హెచ్.రాజమాత ప్రమోదా దేవి వడియార్ హాజరయ్యారు. ఉదయం సత్యసాయి విద్యార్థులతో కలిసి మహిళలు పెద్ద ఎత్తున సభా వేదిక వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. మహిళలు స్వశక్తితో ఎదిగి, వారి శక్తి ఏమిటో నిరూపించుకోవాలని అన్నారు. రాజమాత ప్రమోదా దేవి మాట్లాడుతూ మహిళల్లో ఆత్మగౌరవం నింపడానికి సత్యసాయి ట్రస్ట్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూరోపియన్ దేశాల సలహాదారు పెట్రోకాలినో వ్యాలీతో పాటు మహిళలు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

- జయంతి వేడుకల్లో పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇందిరాగాంధీ ప్రధానిగా దేశానికి చేసిన సేవలు మరువలేనివని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ.. గరీబీ హఠావో, బ్యాంకుల జాతీయకరణ సంస్కరణలు చేసి పేద ప్రజల గుండెల్లో ఇందిరాగాంధీ ఉండిపోయారన్నారు. అనంతరం రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయనతోపాటు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు, షేక్ నాగూర్, పివై కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నగ్నముని రచనలు మానవ మనుగడకు స్ఫూర్తి

- 'కొయ్యగుర్రం' మహాకావ్యం ఆవిష్కరణలో ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-తెనాలిరూరల్ (గుంటూరు జిల్లా)

కొయ్యగుర్రం 4వ ముద్రణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తదితరులు

నగ్నముని రచనలు మానవ మనుగడకు స్ఫూర్తినిస్తాయని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. నగ్నముని 'కొయ్యగుర్రం' ఆధునిక మహాకావ్యం నాలుగో ముద్రణ పుస్తకాన్ని గుంటూరు జిల్లా తెనాలిలోని కవిరాజు పార్క్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభకు రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ నగ్నముని రచనలు పాఠకులకు నిగంటువు అని కొనియాడారు. మానవ మనుగడకు స్ఫూర్తినిస్తాయన్నారు. జ్ఞానపీఠ అవార్డును సైతం తిరస్కరించి ప్రజాకవిగా పేరెన్నికగన్నారని గుర్తు చేశారు. నాకు ముఖమే లేనప్పుడు పౌడరు అద్దుతావెందుకు... అనే ఆయన రచనల్లో పదప్రయోక్తులు సహజ జీవితంలో ఆలోచించే విధంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు గుత్తి సుబ్రహ్మణ్యం, అరవింద స్కూల్స్ కరస్పాండెంట్ సంపూర్ణ, విఎస్ఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు ఎ.రాజేశ్వరిలను సన్మానించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ అంబటి సురేంద్రరాజు, ఎన్ఆర్ఐ జిఎస్ నాగేశ్వరరావు, ఎన్ఆర్ తపస్వి, తిరుమలశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొని నగ్నముని సాహిత్యంపై మాట్లాడారు.

వ్యక్తిగత విమర్శలు మానుకో

- విజయసాయికి టిడిపి నేతల హితవు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి వ్యక్తిగత విమర్శలు మాని ప్రజలకు ఏదన్నా చేయడానికి ప్రయత్నించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు సూచించారు. బెయిల్‌పై పదేళ్లుగా ఊగిసలాడే వ్యక్తికి లోకేష్, భువనేశ్వరిని విమర్శించే స్థాయి లేదని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపిలో ఆయన స్థానం కనుమరుగవుతోందని, దాన్ని భర్తీ చేసుకునేందుకు ఇష్టారీతిన నోరుపారేసుకుంటున్నారని విమర్శించారు. విధానపరమైన విమర్శలు చేయడం రాని వ్యక్తి రాజ్యసభ సభ్యులుగా ఉండి వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. భువనేశ్వరి చేపట్టే సేవా కార్యక్రమాల్లో ఒక్క శాతమైనా చేయగలవా? అని ప్రశ్నించారు.

- భువనేశ్వరి, పురందేశ్వరి గురించి ఏడవడం మానేయాలని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మరో ప్రకటనలో విజయసాయిరెడ్డికి సూచించారు.
- ప్రజల ప్రాణాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెలగాటమాడుతున్నారని టిడిపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. సోషల్ ప్రోగ్రెస్ ఇండెక్స్ ప్రకారం పేదలకు ప్రాథమిక వైద్యం అందించడంలో దేశవ్యాప్తంగా రాష్ట్రాన్ని 23వ స్థానానికి దిగజార్చారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.1000 దాటితే ఉచిత వైద్యం పేదలకు ఎక్కడా ఆరోగ్యశ్రీ కింద జరగడం లేదని అన్నారు.
- జగనన్న దోపిడీ గ్యారెంటీ పథకంలో ఆయనకు నచ్చిన కాంట్రాక్టు సంస్థలు, వ్యక్తులకు ప్రజల సొమ్ము దోచిపెట్టడానికి వీలుగా ముఖ్యమంత్రి గ్యారెంటీ లెటర్స్ ఇస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. ఎంత మొత్తం కమీషన్లు తీసుకుని ఈ విధంగా చేస్తున్నారో ఆర్థికశాఖ మంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు.

కులగణనకు సిద్ధమవుతోన్న ఉద్యోగులు

- నేటి నుంచి 4 రోజులు శిక్షణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కులగణన-2023కు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు సిద్ధమయ్యారు. ఇప్పటికే జిఎస్‌డబ్ల్యుఎస్ యాప్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. సర్వే పూర్తిగా జిఎస్‌డబ్ల్యుఎస్ వలంటీరు మొబైల్ అప్లికేషన్‌లో చేయాల్సి ఉంటుంది. గతంలో ఏదైనా సర్వే చేయాలంటే వలంటీరు ఆధార్ నెంబర్‌తో లాగిన్ అయ్యేవారు. కానీ కొత్తగా అప్డేట్ అయిన మొబైల్ అప్లికేషన్‌లో వలంటీరు 8 అంకెల సిఎఫ్‌ఎమ్ఎస్ ఐడి ద్వారా లాగిన్ కావాల్సి ఉంటుందని సచివాలయాలశాఖ పేర్కొంది. యాప్‌ను ఎలా వినియోగించాలనే అంశంపై ఈ నెల 20 నుంచి 23 వరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమం నిర్వహించనుంది. మండల/మున్సిపాలిటీ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ఇప్పటికే ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈ నెల 20న విజయవాడలో జరగనున్న ప్రాంతీయ సదస్సులో ఎన్‌టిఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల వారు పాల్గొంటారు. ఈ నెల 27 నుంచి కులగణన వారం రోజుల పాటు డోర్‌టు డోర్ సర్వే చేసేందుకు ఉద్యోగులు సిద్ధమయ్యారు. సర్వే చేయని, హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో లేని కుటుంబ సభ్యుల సర్వే చేసేందుకు డిసెంబరు 10 వరకు ప్రభుత్వం గడువు విధించింది.

కులగణన సర్వేలో కుటుంబ ప్రాథమిక వివరాలతో పాటు కుటుంబ పెద్ద పేరు, ఆధార్ నెంబర్, కుటుంబ సభ్యుల పేర్లు, ప్రస్తుత చిరునామా, రైస్ కార్డు నెంబర్, నివాసం ఉంటున్న ఇంటి రకం (రేకుల ఇళ్లు, పూరి గుడిసె, డాబా ఇళ్లు, డూప్లెక్స్ హౌస్, అపార్టుమెంట్‌లో ఇళ్లు, మరుగుదొడ్డి సదుపాయం ఉందా? లేదా? ఇంటికి తాగునీటి సదుపాయం (మున్సిపల్ కుళాయి/పంచాయతీ టాప్/ పబ్లిక్ టాప్/బోర్‌వెల్/చెరువు/పబ్లిక్ బోర్‌వెల్/ ప్యాకేజీ వాటర్ ఉపయోగిస్తున్నారా? గ్యాస్ సదుపాయం (ఎల్‌పిజి/గ్యాస్/కిరోసిన్/ కర్రలు పొయ్యి/బయోగ్యాస్ ఉపయోగిస్తున్నారా? పశుసంపద ఏమైనా ఉందా? మతం, విద్యార్హత, వృత్తి, పంట భూమి, నివాస భూమి వంటి వివరాలను సేకరించనున్నట్లు తెలిసింది.

సర్వేలో పాల్గొనేది వీరే..

సర్వేలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కలిసి పాల్గొననున్నారు. సర్వే చేసిన ఇంటి కుటుంబ యజమాని ఇకెవైసి తప్పనిసరి. 8 ఏళ్లలోపు ఉన్నటువంటి పిల్లలకు మినహాయింపు ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. మండలం డివిజనల్, జిల్లా స్థాయి అధికారులు వెరిఫికేషన్ ఆఫీసర్లుగా వ్యవహరించనున్నారు.

సిఎం అవినీతిపై ఫిర్యాదు చేస్తా

- బిసివై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయాదవ్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ అవినీతికి పాల్పడ్డారని భారత చైతన్య యవజన (బిసివై) పార్టీ అధ్యక్షుడు బోడేపూడి రామచంద్రయాదవ్ ఆరోపించారు. దీనిపై పులివెందుల పోలీస్‌స్టేషన్లో తమ పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఫిర్యాదు చేస్తానని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో బిసివై పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం రామచంద్రయాదవ్ మీడియాతో మాట్లాడుతూ ప్రజా ఆకాంక్ష మేరకు తాను రాజకీయ పార్టీని ప్రారంభించానని, తన వెనుక ఏ ఇతర రాజకీయ పార్టీలూ లేవని స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు 45 మంది పోటీ చేస్తున్నారని తెలిపారు. ఎపిలో ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామని ప్రకటించారు. పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీలను రానున్న రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన అవినీతిమయమైందని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రిగా రూ.వేల కోట్లు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. దీనిపై తాను కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఫిర్యాదు చేశానని తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబును రాజకీయ కక్షసాధింపుతోనే అరెస్టు చేశారన్న ఆయన టిడిపి, జనసేన పొత్తుపై స్పందించబోనని అన్నారు.

ఫొటోషూట్‌కెళ్లి ఇద్దరు విద్యార్థుల మృతి

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణాజిల్లా)

ఫొటోషూట్ కెళ్లి ఇద్దరు విద్యార్థులు చెరువులో పడి మృతిచెందిన ఘటన కృష్ణా జిల్లా గన్నవరం మండలం సావరగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..విజయవాడ పడమట ఎన్ఎస్ఎమ్ పాఠశాలకు చెందిన తొమ్మిది తరగతి చదువుతున్న శశివర్ధన్ (14), పదో తరగతి చదువుతున్న అంకిత్ (15) స్నేహితులు. ఆదివారం సెలవు కావడంతో ఫొటోషూట్ కోసం ఇద్దరూ సావరంగూడెం ఏరియాలోని బాపడు చెరువు వద్దకు వెళ్లారు. ఆ తరువాత తమ స్నేహితులకు ఫోన్ చేయగా మరో నలుగురు వచ్చారు. ఫొటోలు దిగుతున్న క్రమంలో శశి, అంకిత్ చెరువులో పడిపోయారు. ఇద్దరికి ఈత రాకపోవడంతో ఒక్కసారిగా మునిగిపోయారు. ఒడ్డుమీద ఉన్న నలుగురు స్నేహితులు కేకలు వేయడంతో గ్రామంలోని యువకులు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. గత ఈతగాళ్ల సహాయంతో వారిని బయటకు తీశారు. అప్పటికే ఊపిరాడక ఇద్దరూ మరణించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

యూనిమని ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌చే తనఖా పెట్టినబంగారు ఆభరణాలవేలం 23.11.2023, 10.00 AM వద్ద No. 3-6-2-/1, Ground Floor Grandpas Royal Mansion, Liberty Jn., Himayatnagar, Hyderabad - 500029. ఎద్ద జరుగుతుందనిఇందుమూలంగా ప్రజలకు తెలియచేయబడుతోంది. వేలం వేయబడేబంగారు ఆభరణాలు తమ బకాయిలుచెల్లించడంలో విఫలమైన వివిధ కస్టమర్ల ఋణ ఖాతాలకు చెందినవి. మా వేలంపాట నోటీసులు ఈ ఋణగ్రహీతలకు కూడా జారీచేయబడ్డాయి. వివిధ కస్టమర్ల వేలం వేయబడేబంగారు ఆభరణాలకు చెందిన గడువు తీరిన ఋణ ఖాతా బ్రాంచ్ పేరుతోక్రింద ఇవ్వబడింది.

Loan Nos: GUNTUR (GNR) - 1971249.VIJAYAWADA (VIJ) - 2026602, 2029208, 2037518

For more details, please contact : Mr. Japa Ashok Reddy - 9848162782

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

యూనిమని ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌చే తనఖా పెట్టినబంగారు ఆభరణాలవేలం 23.11.2023, 10.00 AM వద్ద No. 3-6-2-/1, Ground Floor Grandpas Royal Mansion, Liberty Jn., Himayatnagar, Hyderabad - 500029. ఎద్ద జరుగుతుందనిఇందుమూలంగా ప్రజలకు తెలియచేయబడుతోంది. వేలం వేయబడేబంగారు ఆభరణాలు తమ బకాయిలుచెల్లించడంలో విఫలమైన వివిధ కస్టమర్ల ఋణ ఖాతాలకు చెందినవి. మా వేలంపాట నోటీసులు ఈ ఋణగ్రహీతలకు కూడా జారీచేయబడ్డాయి. వివిధ కస్టమర్ల వేలం వేయబడేబంగారు ఆభరణాలకు చెందిన గడువు తీరిన ఋణ ఖాతా బ్రాంచ్ పేరుతోక్రింద ఇవ్వబడింది.

KHAMMAM (KHM) - 2027068, 2024083, 2010072, 2028151, 1968668, 2025354, 2029085, 2028524, 2030307, 2029071, 1990996, 2024468, 2027066, 2008783, 2028139, 2008758, 2029641, 2008717, 2026661, 2009255, 2004432, 2027138, 2028930, 2038479, 2014514, 2031223, 2022150, 2024512, 2042182, 1999810, 2001241.

For more details, please contact : Mr. Praveen Naik - 9346463522

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

POONAWALLA HOUSING FINANCE
Apna Ghar, Apni Pehchan

పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)
నమోదిత కార్యాలయం : 602, 6వ అంతస్తు, జీరో వన్ ఐటి పార్క్, ఎస్.ఆర్. నెం. 79/1, ఘోర్పాడి, ముంద్వారోడ్డు, పూనే-411036.

డిమాండ్ నోటీసు
(SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) కింద)

ఈ క్రింద ప్రస్తావించిన రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారులైన మీరు మీ యొక్క స్థిరాస్తి తాకట్టు పెట్టడం ద్వారా ఆస్తి సౌకర్యం(లు) పై పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) "యమ్ హెచ్ ఎఫ్ ఎల్" నుంచి హోమ్‌లోన్/లోన్స్ వినియోగించుకున్నారు. వీటిని తిరిగి చెల్లించుటలో మీరు విఫలమైనారు కావున మీ యొక్క లోన్/లు నిరర్ధక ఆస్తులుగా వర్గీకరించడమైనది. మొత్తం బకాయిలను తిరిగి రాబట్టుకునేందుకు సెక్యూరిటైజేషన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 యొక్క విభాగము 13(2) క్రింద దిగువ పేర్కొనబడిన రుణగ్రహీత/ హామీదారులు యొక్క చివరిగా తెలిసిన చిరునామాకు డిమాండ్ నోటీసు జారీ చేయగా అవి అందజేయబడక తిరిగి వచ్చినందున ప్రత్యామ్నాయ మార్గంగా ఇందులో ఉన్న అంశాలను సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిభంధనలు, 2002 యొక్క నిబంధన 3(1) తో చదివే చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం ప్రచురించవలసి వచ్చినది. రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారులు సెక్యూరిటీలు, బకాయి మొత్తం, సెక్షన్ 13(2) క్రింద పంపిన డిమాండు నోటీసు తేదీ, అందులో పేర్కొన్న మొత్తం యొక్క వివరాలు ఈ క్రింది వివరించబడ్డాయి.

క్ర. సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారు పేర్లు మరియు లోను మొత్తం	సెక్యూర్డ్ అసెట్ వివరాలు	డిమాండు నోటీసు తేది	బకాయి మొత్తం రూ.లో
1.	భావేష్ సోలంకి, కొత్తారి స్నేహ, మహేంద్ర జ్యువెలరీ మార్ట్ లోన్ మొత్తం: రూ.2,43,00,000/- ఏదైతే కలిగి ఉందో రూ.1,50,00,000/- వైడ్ లోన్ ఎకౌంట్ బేరింగ్ HL/0053/H/12/100023 మరియు రూ.93,00,000/- వైడ్ లోన్ ఎకౌంట్ బేరింగ్ నం. HL/0053/H/13/100065	విజయవాడ, ఇస్లాపేట, బోడెమ్మ హోటల్ వద్ద, పడి వీధి, మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ డో.నం.12-12-7, 7ఎ, 7బి, 7సి కొలిచే 2529 చ.అ.లు. బోడెమ్మ హోటల్ వద్ద పిన్‌కోడ్-520001, హద్దులు : తూర్పు: మున్సిపల్ రోడ్డు, పడమర : గుడివాడ పుల్లయ్య గారి సత్రం, ఉత్తరం: తోట వెంకట భారతమ్మ, దక్షిణం: గుడివాడ సుధాకరబాబు.	06/11/2023	లోన్ నం.HL/0053/H/12/100023 రూ. 98,52,167.51/- (తొంభై ఎనిమిది లక్షల యాభై రెండు వేల ఒక వందా అరవై ఏడు రూపాయల యాభై ఒక పైసలు మాత్రమే) తిరిగి చెల్లించే వరకు తదుపరి వడ్డీ @ 15 శాతం పి.ఎతో పొందడం. లోన్ నం.HL/0053/H/13/100065 రూ.75,82,748.79/- (డెభై ఐదు లక్షల ఎనభై రెండు వేల ఏడు వందల నలభై ఎనిమిది రూపాయల డెభై తొమ్మిది పైసలు మాత్రమే) తిరిగి చెల్లించే వరకు తదుపరి వడ్డీ @ 17.05 శాతం పి.ఎతో పొందడం.

ఈ నోటీసు తేదీ నుంచి పైన ప్రస్తావించినట్లుగా డిమాండు చేసిన మొత్తం బకాయిలను భవిష్యత్తు వడ్డీతో పాటుగా 60 రోజులలోగా చెల్లించవలసినదిగా రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారులైన మీకు సమాచారం ఇవ్వడమైనది. విఫలమైన పక్షంలో దిగువ సంతకందారు చట్టం ప్రకారము పైన ప్రస్తావించిన సెక్యూరిటీలను స్వాధీనము చేసుకొనుటకు చర్యలు తీసుకుంటారని తెలియజేయడమైనది. చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం మా సమ్మతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతర మార్గాల ద్వారా సెక్యూరిటీలను బదిలీ చేయుట నుంచి మీరు నిరోధించబడినారని దయచేసి గమనించగలరు.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ
తేది: 20.11.2023

పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున
(గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)
అధీకృత అధికారి

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Home Finance

నమోదిత కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (తూర్పు), ముంబై-400051
శాఖా కార్యాలయం: ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరి కుర్లా రోడ్డు, అంధేరి తూర్పు, ముంబై-400059
శాఖా కార్యాలయం: 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.

రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత/ సహ రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	గంజికుంట కోదండ రామాంజనేయులు (రుణగ్రహీత), గంజికుంట శ్రీనివాసరావు (సహ రుణగ్రహీత)/ LHVJW00001482328	53-1-50 ఆర్.ఎస్.నం.413/ఏ, గుణదల విజయనగర్ కో, పాత డో.నం.53-150, కొత్త డో.నం.53-1-50/1. ఆర్.ఎస్.నం.43, పాత మూల్యాంకనం నం.6055599, కొత్త మూల్యాంకనం నం.1073195211, గుణదల, విజయవాడ, గుణదల-413/ఏ విజయవాడ ఆంధ్రప్రదేశ్-520010 (రిఫ్.ఎల్ఎఎన్ నం.LHVJW00001482328) హద్దులు : ఉత్తరం: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, దక్షిణం: ఆర్.ఏసుపాదం ఆస్తి, తూర్పు : ఎమ్.కస్తూరిబాయి ఆస్తి, పడమర : బి.రాజేశ్వరరాజు ఆస్తి/స్వాధీనతా తేది : 14-నవంబర్-2023	18-08-2023 Rs. 38,99,337/-	విజయవాడ-బి

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 20 నవంబర్, 2023
ప్రదేశం : విజయవాడ

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్: యూనిట్ నం. 203, అమిత్ బిల్డింగ్, పిరమల్ అగస్త్య కార్పొరేట్ పార్క్, అగ్నిమాపక దళం స్టేషన్ ఎదురుగా కమని జంక్షన్, L.B.S. మెయిన్ రోడ్, కుర్లా (పశ్చిమ) ముంబై - 400 070

బ్రాంచ్ కార్యాలయం: డోర్.నెం: 5-1-451, 3వ అంతస్తు, సుజుకి షోరూమ్ మేడమీద, పల్నాడు రోడ్, నరసరావు పేట, గుంటూరు జిల్లా- 522 601 & రేపల్లె బ్రాంచ్

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు - 2002 పరిధిలో ఈ క్రింది సంతకందారు మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇప్పటి నుండి MRHFL గా పరిగణించునది), రిజిస్టర్డ్ కార్యాలయం, మహీంద్రా టవర్స్, 4వ అంతస్తు, Dr.G.M.భోసలే మార్గ్, వర్లి, ముంబై 400 018 ఇండియా వద్ద మరియు బ్రాంచి కార్యాలయం - డోర్.నెం: 5-1-451, 3వ అంతస్తు, సుజుకి షోరూమ్ మేడమీద, పల్నాడు రోడ్, నరసరావు పేట , గుంటూరు జిల్లా- 522 601 & రేపల్లె బ్రాంచ్ వద్ద కలిగియున్న సంస్థ అధీకృత అధికారిగా మరియు సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 యొక్క 3వ రూలుతో కూడిన సదరు చట్టం 13 (12) విభాగం క్రింద సంక్రమించిన అధికారాలతో ఈ క్రింది ప్రతి ఖాతాకు ఎదురుగా సూచించిన మొత్తమును చెల్లించవలసినదిగా సంబంధిత రుణగ్రహీత/లును సదరు నోటిసు స్వీకరణ తేదీ నుండి 60 దినములలోగా చెల్లించవలసినదిగా ప్రతి ఖాతా ఎదురుగా తెలిపిన తేదీలలో డిమాండ్ నోటిసు/లు జారీ చేసినారు. రుణగ్రహీత/లు సదరు మొత్తమును తిరిగి చెల్లింపు చేయుటలో విఫలమైనారు. కనుక రుణగ్రహీత/లుకు మరియు యావన్మంది ప్రజానీకమునకు తెలియచేయునది ఏమనగా సదరు చెప్పిన నియమావళి యొక్క రూ.లు 8 తో కూడిన సదరు చట్టం 13 (4) విభాగం పరిధిలో అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో దిగువ వివరించిన ఆస్తి/ఆస్తులను క్రింది సంతకందారు ప్రతి ఖాతా ఎదురుగా తెలిపిన తేదీన స్వాధీన పరచుకొనినారు. రుణగ్రహీత/లుకు ప్రత్యేకంగాను మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు అట్టి లావాదేవీలు ఏవైనను మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి లోను అగ్రిమెంటు ప్రకారం చెల్లించవలసిన మొత్తము మరియు అందుపై వడ్డీ చెల్లింపునకు లోబడి మాత్రమే నిర్వర్తించవలెను. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సదరు చట్టం 13వ విభాగం (8)వ ఉప-విభాగం నియమావళి పరిధిలో తగిన సమయం లభించునని రుణగ్రహీతలకు సూచించటమైనది.

వ. నెం	అగ్రిమెంట్ నెం. / ఫిన్ నెం.	రుణ గ్రహీత /సహ-రుణ గ్రహీత / హామీదారు(లు)	డిమాండ్ నోటీస్ తేదీ	డిమాండ్ నోటీస్ ప్రకారం మొత్తం	స్వాధీన పరచు కున్న తేదీ	స్థిరాస్థి వివరణ
1	XRESNRS00994375/1281368	శ్రీ/శ్రీమతి బుసి మరియదాసు తండ్రి థామసు (రుణగ్రహీత), శ్రీ/శ్రీమతి. బుసి లావణ్య భర్త మరియదాసు, (సహ-రుణగ్రహీత) ఆర్.ఎస్.నెం. 336ఎ-ఎ, D.No.3-115/8, గొరిజవోలు గ్రామం, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522601. శ్రీ/శ్రీమతి గారపాటి రాయప్ప తండ్రి వీరయ్య (హామీదారులు) D.No.3-27-2, గొరిజవోలు, నాదెండ్ల, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522601.	09-11-2022	రూ. 1,37,278/- (ఒక లక్ష ముప్పై ఏడు వేల రెండు వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే)	14-11-2023	D.No. 3-115/8, గొరిజవోలు గ్రామం, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా. ఆంధ్రప్రదేశ్ - 522601. వద్ద ఆర్.ఎస్.నెం. 336ఎ-ఎ, సంపూర్ణమైన ఆస్థి సరిహద్దులు: తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర: వై.వీరసామి గారి ఇల్లు, ఉత్తరం: ఎల్.అన్నా మేరీ గారి ఇల్లు, దక్షిణం: పి. ఇసాకు బి. గారి ఇల్లు.
2	XRESNRS00906976/ 1148945	శ్రీ/శ్రీమతి కిన్నెర కోటేశ్వరరావు తండ్రి యేసు (రుణగ్రహీత), శ్రీ/శ్రీమతి కిన్నెర ఆదిలక్ష్మి భర్త కోటేశ్వరరావు, (సహ-రుణగ్రహీత) ఆర్.ఎస్.నెం.175, D.No.1-85, గోపాలంవారిపాలెం గ్రామం, చిలక లూరిపేట మండలం, పల్నాడు జిల్లా. ఆంధ్రప్రదేశ్-522626. శ్రీ శ్రీమతి. ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు తండ్రి ఆదిబాబు (హామీదారులు), D.No.2-33, గోపాలం వారి పాలెం గ్రామం, చిలకలూరిపేట మండలం, పల్నాడు జిల్లా. ఆంధ్ర ప్రదేశ్-522626	09-11-2022	రూ. 1,24,480/- (ఒక లక్ష ఇరవై నాలుగు వేల నాలుగు వందల ఎనభై రూపాయలు మాత్రమే)	14-11-2023	D.No. 1-85, గోపాలం వారి పాలెం గ్రామం, చిలకలూరి పేట మండలం, పల్నాడు జిల్లా. ఆంధ్రప్రదేశ్-522626. వద్ద ఆర్.ఎస్.నెం.175, సంపూర్ణమైన ఆస్థి సరిహద్దులు: తూర్పు: కె. కోటేశ్వరరావు గారి ఇల్లు, పడమర: కె. స్వామి బాబు గారి భూమి, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: రోడ్డు.
3	XRESARE01001490/1283028	శ్రీ/శ్రీమతి యడల సుధీర్‌కుమార్ తండ్రి లక్ష్మణ్ (రుణగ్రహీత), శ్రీమతి యడల సరిత భర్త లక్ష్మణ్, (సహ-రుణగ్రహీత) యడల లక్ష్మణ్ తండ్రి చెన్నయ్య, (సహ-రుణగ్రహీత) సర్వే నెం.24-1బి, D.No: 4-284, నల్లూరిపాలెం గ్రామం, రేపల్లె మండలం, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్-522265. శ్రీ/శ్రీమతి గూడూరు ప్రసాద్ తండ్రి దావీద్ తండ్రి ఆదిబాబు (హామీదారులు) D.No. 5-29-111, నల్లూరిపాలెం గ్రామం, రేపల్లె మండలం, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్-522265.	09-11-2022	రూ. 1,49,175/- (ఒక లక్షా నలభై తొమ్మిది వేల నూట డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే)	16-11-2023	D.No: 4-284, నల్లూరి పాలెం గ్రామం, రేపల్లె మండలం, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్-522265 వద్ద సర్వే నెం. 24-1బి, సంపూర్ణమైన ఆస్థి సరిహద్దులు: తూర్పు: కోడూరు రామస్వామి గారి ఇల్లు, పడమర: పంచాయతీ కానా, ఉత్తరం: పంచాయతీ రోడ్డు, దక్షిణం: మండవ శ్రీనివాసరావు గారి ఇల్లు.
4	XRESARE00893662/1114548	శ్రీ/శ్రీమతి మాతంగి రవీంద్ర తండ్రి కోటేశ్వరరావు (రుణగ్రహీత), శ్రీ/శ్రీమతి మాతంగి మంగమ్మ భర్త కోటేశ్వరరావు (సహ-రుణగ్రహీత) మాతంగి కోటేశ్వరరావు తండ్రి రామయ్య, (సహ-రుణగ్రహీత) సర్వే నెం.113-9, D.No: 2-164, దాసరి పాలెం గ్రామం, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా ఆంధ్రప్రదేశ్-522256. శ్రీ/శ్రీమతి బుస్సా సుధాకరబాబు తండ్రి రాజేంద్రప్రసాద్ (హామీ దారులు) D.No:4-82, దాసరి పాలెం గ్రామం, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా. ఆంధ్రప్రదేశ్-522266.	09-11-2022	రూ. 1,23,722/- (రూ. లక్షా ఇరవై మూడు వేల ఏడు వందల ఇరవై రెండు రూపాయలు మాత్రమే)	16-11-2023	D.No: 2-164, దాసరి పాలెం గ్రామం, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా ఆంధ్రప్రదేశ్-522256. వద్ద సర్వే నెం.113-9, సంపూర్ణమైన ఆస్థి సరిహద్దులు: తూర్పు: గంటా భూషణం గారి ఇల్లు, పడమర: గద్దం సుమలత గారి ఇల్లు, ఉత్తరం: పంచాయతీ చెరువు, దక్షిణం: పులగర చట్టయ్య గారి ఇల్లు.
5	XRESARE00843420/1045341	శ్రీ/శ్రీమతి రెబ్బా గౌరీశంకర్ తండ్రి నల్లమహారాజ్, (రుణగ్రహీత), శ్రీ/శ్రీమతి రెబ్బా విజయలక్ష్మి భర్త గౌరీశంకర్, (సహ-రుణగ్రహీత) సర్వే నెం. 158, D.No:1-72, పెసర్లంక గ్రామం, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా. ఆంధ్రప్రదేశ్-522257. శ్రీ/శ్రీమతి. కంభం నాగార్జున తండ్రి భాస్కరరావు (హామీదారులు) D.No:5-38/2, పెసర్లంక గ్రామం, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా. ఆంధ్రప్రదేశ్ -522257.	09-11-2022	రూ. 1,09,138/- (ఒక లక్ష తొమ్మిది వేల నూట ముప్పై ఎనిమిది రూపాయలు మాత్రమే)	16-11-2023	D.No: 1-72, పెసర్లంక గ్రామం, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా. ఆంధ్రప్రదేశ్-522257 వద్ద సర్వే నెం.158, సంపూర్ణమైన ఆస్థి సరిహద్దులు: తూర్పు: జాలాది ప్రకాష్ గారి ఇల్లు, పడమర: ఆర్ & బి రోడ్డు, ఉత్తరం: రెబ్బా బాబూరావు గారి ఇల్లు, దక్షిణం: రెబ్బా ధర్మారావు గారి ఇల్లు

స్థలం : గుంటూరు
తేదీ : 20-11-2023

సం /- అధీకృత అధికారి
M/S. మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

" ప్రపంచం మనం ఊహించినంత వినోదభరితంగా లేదని నేను మీకు హామీ ఇస్తున్నాను. అందుకనే వాస్తవ ప్రపంచం గురించి రాయండి."

– పియరీ చోడెర్లోస్ డి లాక్లోస్

కాలనాళికలు 'గుంటూరు కథలు'

సమీక్ష

తెలుగు నాట వివిధ కాలాల్లో సాగిన ఉద్యమాలకు, సామాజిక పరిస్థితులకు అద్దం పట్టే అపూర్వ కథల సంకలనం 'గుంటూరు కథలు'. ప్రముఖ సాహితీవేత్త, అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ప్రస్తుత అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణ సంపాదకత్వంలో 2013లో ఈ కథా సంకలనం వెలువడింది. ఇది జరిగి కూడా దశాబ్ద కాలం నిండింది. ఈ సందర్భంగా ఈ కథా సంకలనాన్ని, అందులోని కథలను ఒకసారి అవలోకిద్దాం.

'గుంటూరు కథలు' వివిధ సామాజిక స్థితిగతులను, మానవ సంఘర్షణలను అపూర్వమైన జీవన చిత్రణలను మన ముందుంచుతాయి. సుమారు 70 మంది ప్రముఖ రచయితలు రాసిన కథలతో కూర్చిన కథా సంకలనం ఇది. అక్కిరాజు ఉమాకాంతమ్ తొలి కథ 'అన్నపూర్ణ'తో ప్రారంభం అయ్యే ఈ సంకలనం, వేదగిరి రాంబాబు కథ 'తల్లి'తో ముగుస్తుంది. ఈ 70 మంది రచయితల కథలనూ– అవి రాసిన కాలంలోని సాంఘిక పరిస్థితులను బట్టి రకరకాల ఉద్యమాలను ఎలా ప్రతిబింబించాయో తెలిపేట్లుగా వర్గీకరించారు. కనపర్తి వర లక్ష్మమ్మ (1896–1978) 'దీర్ఘసుమంగళీ భవ' (భారతి, ఆగష్టు, 1928) కథతో 'సంస్కరణోద్యమం – స్వాతంత్రోద్యమం' కథల్లోకి చొచ్చుకు రావటం ప్రారంభం అయింది. వజ బాబురావు ('మల్లు పంచె', భారతి మాస పత్రిక), కేవి.సుబ్బయ్య ('ఆత్మశాంతి', ఆంధ్ర విద్యార్థి పక్ష పత్రిక, డిసెంబర్ 15, 1947), బొల్లిముంత శివరామకృష్ణ ('దేశం ఏం కావాలి?') వంటి వారి కథలను ఈ ఉద్యమానికి తొలి పునాది రాళ్లను వేసినట్టుగా పరిగణించారు.

తరువాతి కాలంలో తెలుగునాట 'కమ్యూనిస్టు ఉద్యమం ప్రధాన పాత్ర పోషించింది. మునిపల్లె వీర్రాజు ('దొడ్డమ్మ వారసులు', స్వాతి, ఏప్రిల్, 1988), కొడవటిగంటి కుటుంబరావు ('పైకివచ్చినవాడు', ఆంధ్రప్రభ వారపత్రిక, డిసెంబర్ 8, 1954), రావూరి భరద్వాజ (ఎందుకైనా మంచిది, కథావాహిని–3, 1954), ఆలూరి భుజంగరావు ('నిన్నటికి నేడు ఏమవుతుంది? అరణ్యపర్వం, కథా సంపుటి, జనవరి 1997), నల్లూరి రుక్మిణి, 'బీటలెత్తిన బీళ్ల కోసం' (అరుణతార, మే 2003) కథల్లో కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం కనిపిస్తుంది. ఈ ఉద్యమాల వర్గీకరణ చేయటం, వాటి కింద కొంతమంది రచయితల పేర్లు మాత్రమే ఇవ్వటం అనేది ఒక సూచనా మాత్రంగానే పరిగణించాలి. ఈ ఉద్యమాలకు బీజాలు పడేందుకు తొలినాళ్లలో గొప్ప కథలు రాసిన వారిలో వీరూ కొందరిని అర్థం చేసుకోవాలి .

శ్రమ, కులం , మతం కింద 9 మంది ప్రసిద్ధ కథా రచయితలను చేర్చారు. వట్టికొండ విశాలాక్షి (రిక్షావాలా, ఆంధ్ర జ్యోతి, 1954)తో ప్రారంభించి, గోపీచంద్ (చెప్పులు కుట్టేవాడు, పతితులు కథా సంపుటి, 1985), మా గోఖలే (ముత్తాయి



కూతురు, భారతి, మార్చి 1956), పెనుమాక నాగేశ్వర రావు (అనుగ్రహం, ఆంధ్రభూమి మాసపత్రిక), బి.పి.కరుణకుమార్, ప్రతాప రవిశంకర్ వంటి రచయితల కథలు ఇందులో చేరాయి. 'సంసారం –స్త్రీ' ప్రధాన భూమికగా మునిమాణిక్యం నరసింహారావు, (మా అల్లుడు, నవ కథావళి), పి.ఎస్.నారాయణ (గొడుగు నీడ, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, మార్చి, 3 2006), వాసిరెడ్డి సీతాదేవి (తరాలు–అంతరాలు, అన్నదాత, మార్చి 1969), పి.సత్యవతి (పెళ్లిప్రయాణం, ఇండియా టుడే వార్షిక సాహిత్య సంచిక 1995), ఓల్గా (పురిటి నొప్పులు, ఆదివారం, వార్త దినపత్రిక, మే 11, 1997), కేతు విశ్వనాథ రెడ్డి (ఇచ్ఛాగ్ని, ఇండియా టుడే వార్షిక సాహిత్య సంచిక, 1995) వంటి హేమాహేమీల కథలుఉన్నాయి.

సంస్కృతి – చరిత్ర విభాగం కింద ఎనిమిది కథలు పొందుపరిచారు. అందులో మల్లాది రామకృష్ణ శాస్త్రి 'డుమువులు' కథ నుంచి, శారద రాసిన 'కౌముది (కథా వాహిని, 1955), పోరంకి దక్షిణామూర్తి 'చంద్రవంక' (కలకత్తా ఆంధ్ర సంఘం వారి ద్వాదశ వార్షిక సంచిక 1965), పొత్తూరి విజయలక్ష్మి కథ సభల సంరంభం దాకా ఉన్నాయి. వ్యవసాయం కింద జి.వి.కృష్ణారావు 'చేసుకున్న కర్మ', తాళ్లూరి నాగేశ్వరరావు 'మమతా– భ్రమత', పాపినేని శివశంకర్ 'చింతల తోపు, వల్లూరి శివప్రసాద్ 'గిట్టుబాటు', ఎంవి రామిరెడ్డి 'ఓ రైతు ఆత్మ కథ'లను చేర్చారు. విద్య – జన్మభూమి శీర్షికన తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రి కథ, బొల్లిముంత నాగేశ్వర రావు 'ఓ డాక్టర్ కథ', చలం 'శమంతకమణితో ఇంటర్వ్యూ', కొలకలూరి ఇనాక్ 'పుట్టినూరు' వంటి కథలున్నాయి. గ్రామీణం శీర్షికన గోపరాజు నాగేశ్వరరావు 'దూడ బాతు', పి.చంద్రశేఖర ఆజాద్ 'ఏరు', విహారి 'దోసిట్లో చీకటి', కె.శరశ్చంద్ర జ్యోతిశ్రీ 'పెదవడ్లపూడి రైల్వేస్టేషన్' వంటి కథలు చేర్చారు. 'మరికొన్ని' శీర్షికన కొడవటిగంటి కృష్ణమూర్తి 'అభివృద్ధి', చందు సుబ్బారావు 'చీలిక' చేర్చారు. విజయం శీర్షికన శ్రీ రమణ 'ధనలక్ష్మి', కాకాని చక్రపాణి 'మూడో మనిషి', 'ఆదర్శం' శీర్షిక కింద సత్యం శంకరమంచి 'వరద', పెద్దిభొట్ల సుబ్బ రామయ్య 'పేరయ్య బావి', వాణిశ్రీ 'చూపు', వేదగిరి రాంబాబు 'తల్లి' పొందుపరిచారు.

ఈ సంకలనంలో ఏ కథకు ఉండే గొప్పతనం దానిదే! 'తొలి తెలుగు కథా రచయిత గుంటూరు సీమ వాడవటం గర్వకారణం' అంటారు పెనుగొండ లక్ష్మీ నారాయణ. అందుచేత ముందు ఆనాటి కథ ఎలా ఉందో 'అన్నపూర్ణ' కథను టూకీగా వివరిస్తాను. సుమారు వందేళ్ల క్రితం భారతీయ గ్రామీణ జీవనం, అప్పటి వివాహ పద్ధతులు, నాడు స్త్రీలు అపరిపక్వ వయస్సులో తమ సమ వయస్కుడు కాని పురుషుడిని వివాహం చేసుకొని వారితో పిల్లలను కనటం, ఆ సంతానం తరుచూ మరణిస్తూ తొలుత తల్లికి, తరువాత వయస్సు ముదిరిన భర్తకు ఎలా నరకప్రాయంగా మారుతాయో కళ్ళకు కట్టినట్టు ఆవిష్కరించారు రచయిత ఉమాకాంతం. ఆ సమాజంలో నరసింహుడు అనే చైతన్యం ఉన్న సోదరుడు అన్నపూర్ణ భవిష్యత్తు గురించి వేదన పడటం ఎంతో కలచి వేస్తుంది. వయసు ముదిరిన సూర్యనారాయణ సాముద్రికం చెప్పే వాడి మాటలు నమ్మి పిల్లలపై పిల్లలని కని, వాళ్ళు వరుసగా చనిపోతుంటే తట్టుకోలేక మంచానపడి మరణించటం, అన్నపూర్ణ కాళ్ళు చచ్చుపడి లేవ లేని స్థితిలో ఉండటం కళ్ళ వెంబడి నీరు జలజలా రాలేట్టు చేస్తుంది. అలాగే కనపర్తి వరలక్ష్మమ్మ రాసిన 'దీర్ఘసుమంగళీ భవ' కథ వితంతు పునర్వివాహం చుట్టూ అల్లినది. వరలక్ష్మమ్మ ఈ కథకు సైద్ధాంతిక బలం జోడిస్తూ, ఒక అద్భుతమైన ఎత్తుగడ వేసి, ఆ ఎత్తుగడలో నాటి బ్రాహ్మణ సమాజ గుత్తాధిపత్యానికి మంగళం పాడిస్తుంది. తొలుత గుత్తాధిపత్యం వెలగబెట్టే పాత్రలను, అవి సృష్టించే అరాచకాలను ఆవిష్కరిస్తారు రచయిత్రి. తరువాత చీమల్లాంటి పాత్రలతో పెత్తందారుల దాష్టీకాలకు ప్రతి ఎత్తులు వేయిస్తారు. పరశురాములు, శివయ్య శాస్త్రి బ్రాహ్మణీకాన్ని అడ్డుపెట్టుకొని అవసరం ఉన్న వాళ్ళకు అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి వాళ్ళ కష్టార్జితాన్ని దోపిడీ చేస్తుంటారు. వీరిరువురి ఇళ్లల్లోనే జన్మించిన శంకరం, పార్వతి తమ తండ్రుల దురాగతాలను ఎండకడుతూ లేచి పోయి గుంటూరులో పెళ్లిచేసుకొంటారు. పార్వతి తన మనోగతాన్ని వెల్లడిస్తూ పరాశరుడు, వశిష్టులను ఉటంకిస్తూ తమ పునర్వివాహం శాస్త్ర సమ్మతమేనని, అందుకు అంగీకరించమని తన తండ్రిని ప్రార్థిస్తూ ఉత్తరం రాయటం కథకే హై లైట్.

నల్లూరి రుక్మిణి రాసిన 'బీటలెత్తిన బీళ్ళ కోసం' కథ హృదయాల్ని ద్రవింపచేస్తుంది. కరువు బారిన పడిన రైతులు పొట్టపట్టుకొని, గొడ్డూ గోదాను వెంటేసుకొని అడవి మార్గం పట్టిన వైనాన్ని గుండెలు బరువెక్కేలా వర్ణిస్తుంది. ఆ రైతులు అన్నలకు, పోలీసులకు 'ఇన్ఫార్మర్లు'గా కనిపిస్తారు. అన్నల చేతిలో 'బతుకు జీవుడా' అని తప్పించుకున్నా, పోలీసుల చేతిలో చచ్చి శవాలుగా మారటంతో కథ ముగుస్తుంది. ఆద్యంతం దుఃఖభరమై సాగే ఈ కథాకథనం ఉత్కంఠభరితంగా సాగుతుంది. కొడవటిగంటి కుటుంబరావు కథ 'పైకి వచ్చిన వాడు' నాటి గ్రామీణ ముఖచిత్రాన్ని, సగటు మనిషైన సీతారామారావు (కథకు ప్రధానపాత్ర ఇదే) గ్రామీణ జీవితం నుంచి పట్టణ స్థాయి ఉద్యోగానికి వెళ్ళేప్పటికీ సమాజంలో రాజకీయంగా, ఆర్థికంగా ఎన్ని మార్పులు చేసుకొన్నాయన్నది కళ్ళకు గట్టినట్టు చిత్రీకరిస్తుంది. పి.ఎస్.నారాయణ 'గొడుగు నీడ' మోడు బారిన భార్యాభర్తల సంబంధాల్లో కూడా తిరిగి పచ్చదనం చిగురిస్తుందని తెలిపే కథ. తల్లావఝ్ఝల శివ శంకరశాస్త్రి గారి కథ 'గాదె' ఆసాంతం పొట్ట పగిలేలా హాస్యం పండిస్తోంది. ఈ కథలో ఆనాటి పాఠశాల ఉపాధ్యాయుల మనస్తత్వ చిత్రీకరణ ఉంది.

వేరు వేరు కాలాల్లో వచ్చిన తెలుగు కథలు ఇవ్వడం ఈ సంకలనానికి ఆయువుపట్టు వంటిది. సాహిత్య, సామాజిక పరిశోధనా ప్రియులకు ఈ కథా సంకలనం అందించే ముడిసరుకు అపారమైందని చెప్పొచ్చు. ఆయా కాలాల్లో సమాజంలో ప్రధాన సమస్యలు ఏమిటి అన్నది సులువుగా ప్రోది చేయవచ్చు. భిన్న రచయితలు ఆయా సామాజిక సమస్యలను ఎలా దర్శించారో, ఎలా విశ్లేషించారో మరోసారి పరిశోధకులు కొత్తగా వాటిని దర్శించి ఆధునిక సామాజిక సైద్ధాంతిక నేపథ్యంలో వివరించవచ్చు. నాటి సాహిత్య విలువలు, భాషా ప్రయోగాలు, వాక్య నిర్మాణాలు మనకెంతో లోతైన అవగాహన నిస్తాయి. కనపర్తి లక్ష్మమ్మ వాడిన అనేక భాషా శబ్దాలు అచ్చ తెలుగువి. ఉదాహరణకు 'ఉమ్మాలికము', 'వేష్టపడ్డారు' వంటివి కొన్ని. ఆవిడ వాక్య వ్యంగ్య నిర్మాణాలు గూడా అలానే ఉంటాయి. 'బుద్ధిశాలియగు విష్ణు శర్మ రాజకుమారులకు హితోపదేశం సేయుటకు కరటక దమనకుల నేనాడు సృష్టించెనో కాని, తత్సంతతి వారు ఇప్పటికినీ ఉన్నారు' అంటుంది. కథా సాహిత్యానికి సంబంధించిన అనేక విషయాలను లక్ష్మీనారాయణ ఈ సంకలనం ప్రారంభంలో వివరించారు. సాహిత్య పరిశోధకులకు, కథాప్రియులకు, సామాజిక చరిత్ర పరిశోధకులకు ఈ పుస్తకం అమూల్యమైనది.

– డా. కొప్పరపు నారాయణ మూర్తి
76719 09759

ఎవరు?

ఎవరు ఎవరికంటే
ఎక్కువ అమానవీయం?
ఎవరు ఎవరికంటే
ఎక్కువ క్రూరులు?
ఎవరు కొట్టబడ్డారు, రక్తసిక్తమయ్యారు,
విరిగిపోయారు?

ఎవరు ఎవరి కంటే
ఎక్కువ ఆయుధాలు కలిగి ఉన్నారు?

ఎవరు దాక్కున్నారు, చనిపోతున్నారు,
సంతాపాన్ని ప్రకటిస్తున్నారు?
ఎవరు నిర్జీవమయ్యారు,
బాధబడ్డారు, కిడ్నాప్ అవుతున్నారు,
ఆకలితో అలమటిస్తున్నారు?
చిక్కుకుపోతున్నారు?
ఎవరు ఆసుపత్రిలో, ఎవరు
పండుగలో,
ఎవరు నిద్ర లేస్తున్నారు?
ఎవరు నిద్రకు సిద్ధమౌతున్నారు?

ఎవరు గుక్కెడు నీరు లేకుండా!
ఎవరు ఇంటికి దూరమై,
సడలిన విశ్వాసంతో ఉన్నారు?
ఎవరి భూమి, ఎవరి చరిత్ర,
ఎవరి మసీదు, ఎవరి మందిరం
ఎవరి కోపం, ఎవరి భయం?

ఎవరు పసికందును
చంకలో పెట్టుకొని నడుస్తున్నది?

ఆంగ్లం : Susan Dambroff
స్వేచ్ఛానువాదం : జాని తక్కెడశిల

నామ విజ్ఞాన శిఖరం యార్లగడ్డ బాల గంగాధరరావు

సందర్భం

నామ విజ్ఞాన శాస్త్రం ... పేర్లను గురించి అధ్యయనం చేస్తోంది. దీనిని ఆంగ్లంలో 'ఓనమాస్టిక్సు' అంటారు. ఈ శాస్త్రానికి రూపురేఖలు కల్పించిన ఘనత ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావుకే దక్కుతుంది. తన గురువు ఆచార్య తూమాటి దోణప్ప చూపిన మార్గాన్ని అనుసరించి ఈ రంగంలో మహోన్నత శిఖరాలను అధిరోహించిన ఘనత ఆయనకు దక్కుతుంది. బాలగంగాధరరావు అంటేనే నామవిజ్ఞానం అనే స్థాయిలో ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. ఊరి పేర్ల నేపథ్యం అనగానే ఆయనే గుర్తుకు వస్తారు.

2002లో ఆయన నామవిజ్ఞానం అనే గొప్ప గ్రంథాన్ని రచించారు. దీన్ని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు పాఠ్య ప్రణాళికలో చేర్పించారు. అప్పట్లో అదే విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ అధిపతిగా పనిచేశారు. ఈ గ్రంథంలో గ్రామనామాలు, ఇంటిపేర్లు, వ్యక్తి నామధేయాలు, వృక్ష, జంతు, వస్తునామాలు, నాడులు, సీమలు తదితర అంశాలను గురించి సమగ్రంగా విశదీకరించారు. ఈ పుస్తకం చూడగానే ప్రతి ఒక్కరికీ ముందుగా తమ ఊరి పేరు గుర్తుకు రావడమే కాకుండా, ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందో తెలుసుకోవాలనే ప్రయత్నం చేస్తారు. వ్యక్తి పేరుతో, వృక్షాల పేర్లతో, సామాజిక వర్గాల పేర్లతో, వృత్తిపేర్లతో ఏర్పడిన గ్రామాలు, పల్లి, పట్నం, పురం, నగరం, పాడు, వాడ, వలస, కొండ, చలం, గిరి, అద్రి, చెరువు, సముద్రం, కోట, దేవతల పేర్లతో ఏర్పాటైన గ్రామాలు, సంఘటనలు తదితర అంశాల ప్రాప్తికి ఆవిర్భవించిన గ్రామాలను వివరించారు. సరిహద్దు రాష్ట్రాల భాషా ప్రభావంతో ఏర్పాటైన పల్లెలు అలాగే మిగిలిన విషయాలు కూడా రాశారు.

ఊరి పేర్లు ప్రాంతీయ చరిత్రకు ప్రతిబింబాలు. ఈ తరహా పుస్తకం తెలుగులో ఇదే మొదటిది కావడం తెలుగు వారందరికీ గర్వకారణం. భాషాశాస్త్రవేత్త యార్లగడ్డ బాల గంగాధరరావు కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామంలో 1940 జూలై 1న కృష్ణమ్మ, భూషయ్య దంపతులకు జన్మించారు.

స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో తొలుత తెలుగు వ్యుత్పత్తి పదకోశంలో కీలక పాత్రను పోషించారు. సమాంతరంగా ఆచార్య దోణప్ప పర్యవేక్షణలో 'అనంతపురం గ్రామం జిల్లా గ్రామనామాలు' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని రాశారు. ఈ గ్రంథం తెలుగు భాషలో కొత్త వెలుగులను ప్రసరింప జేసింది. అంతకముందు గాసట బీసటగా ఉన్న నామవిజ్ఞానం దశదిశలా విస్తరించడానికి బాల గంగాధరరావు అవిశ్రాంత కృషే దోహదం చేసింది. ఆయన 'ఒక ఊరికథ'ను కూడా రాసి మరో ప్రభంజనానికి తెరతీశారు. పేరుకు ఒక ఊరికథ అయినప్పటికీ అసంఖ్యాకమైన ఊరి పేర్ల నేపథ్యాన్ని శాస్త్రీయంగా మొత్తం 171 పుటల్లో అకారాది క్రమంలో అందించారు. శాసనస్థ గ్రామాలకు, అగ్రహార గ్రామాలకు సముచిత రీతిన పొందుపరిచారు. క్రీడాభిరామం, పల్నాటి వీర చరిత్ర, రాధికాసాంత్వనం తదితర కావ్యాలకు వచన రూపంలో అందించారు. కాసుల పురుషోత్తమ కవి రాసిన 'ఆంధ్రనాయక శతకానికి తనదైనశైలిలో భావాలను రాసి విశ్లేషించారు. 'మాటతీరు' అనే గ్రంథంలో 200కి పైగా తేనెలొలికే పదబంధాలను విశ్లేషించారు. ఉదాహరణకు అమ్మబోతే అడివి కొనబోతే కొరివి, కొంగుబంగారం, చెట్టు చేమ, రామాయణంలో పిడకలవేట వంటివి. 'మాటతీరు' అంశాన్ని ఎ.పి ఇంటర్ మొదటి ఏడాది తెలుగు పాఠ్య ప్రణాళికలో చేర్చడం విశేషం.

శ్రీనాథుని హరవిలాసం కావ్యాన్ని ఆయన ఆకాశవాణిలో ధారావాహికంగా 18 వారాల పాటు భావ, రాగ రంజితంగా పఠనం చేశారు. తెలుగులో తొలి వీధి నాటకమైన 'క్రీడాభిరామం'కు మంచి పీఠికను రచించి పునర్ముద్రించారు. తెలుగు భారతంలోని కీలక ఉదంతాలకు సంబంధించి 'విశేషవ్యాఖ్య'తో ప్రచురించారు. భాగవతంలోని మాధుర్యాన్ని పాఠకులకు చవిచూపించారు. మాటమర్మం, అక్షరయజ్ఞం, భావ పరిమళం వంటి రచనలు బాలగంగాధరరావు కలం నుంచి జాలువారినవే! అరకులోయ ప్రాంతపు వాడుక భాషకు సంబంధించి నిఘంటువును రాశారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గురించి ఆయన రాసిన వ్యాసాలు వాసికెక్కాయి. తెలుగు భాషా సాహిత్యాలలో ఆయనొక విజ్ఞాన సర్వస్వం అంటే అతిశయోక్తి కాదు. 2000 సంవత్సరానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిశోధన రంగంలో ఉత్తమ అవార్డును ప్రదానం చేసింది. నామవిజ్ఞాన శాస్త్రవేత్తకు కావలసిన అన్ని అర్హతలూ బాల గంగాధరరావుకు ఉన్నందునే తెలుగు భాషలో మరో చరిత్రను సృష్టించారు. స్థానిక చరిత్ర, ప్రాదేశిక చరిత్ర, మాండలికాలు, భాషా వ్యవహార ప్రాంతపు సంస్కృతి, జలవనరులు, వాటి పేర్లు, అక్కడ లభించే ఖనిజాలు, కొండలు, గుట్టలు, దిబ్బలు, లంకలను గురించి అవసరమైన సమాచారం, ప్రార్థనాలయాలు, గ్రామదేవతలు, పండుగలు, జాతరలు, ఆయా ప్రాంతాల్లోని వృక్ష, జంతుజాలం తదితర అంశాలపై అవగాహన పెంచుకుని, క్షేత్ర పర్యటనలు జరిపి ఆయన గొప్ప నామవిజ్ఞాన వేత్తగా ఎదిగారు. 2016 నవంబరు 23న ఈ సువిశాల సుందర ప్రపంచం నుంచి నిష్క్రమించారు.

– వాండ్రంగి కొండలరావు,
94905 28730

ఖమ్మం ఈస్తటిక్స్ సాహితీ అవార్డుల ఫలితాలు

ఖమ్మం ఈస్తటిక్స్ 2023 సాహిత్య పోటీకి 100కు పైగా కవితా సంపుటాలు, 140కి పైగా కథలూ వచ్చాయి. కవిత్వం విభాగంలో కవి వసీరా సంపుటి 'సెల్ఫీ' రూ.40 వేల బహుమతిని గెలుచుకుంది. అనిల్ డానీ కవిత్వ సంపుటి 'గాంధారి వాన', లండ సాంబమూర్తి కవితా సంపుటి 'నాలుగు రెక్కల పిట్ట', అరుణ నారదభట్ల కవితా సంపుటి 'లోపలి ముసురు' ప్రత్యేక ప్రశంసకు అర్హమైనవిగా ఎంపికయ్యాయి. కథల విభాగంలో ఉత్తమ కథగా శ్రీ ఊహ రచన 'లడాయి' రూ.25 వేల బహుమతిని గెలుచుకుంది. ద్వితీయ ఉత్తమ కథగా స్వర్ణ కిలారి రచన 'ఆరోతనం' రూ. 15 వేల బహుమతిని, తృతీయ ఉత్తమ కథగా జి.ఉమా మహేశ్వర్ రచన 'సంభావన' రూ.10 వేల బహుమతిని గెలుచుకున్నాయి. పెద్దింటి అశోక్ కుమార్ కథ 'కలలు రాలుతున్న నేల', కుప్పిలి పద్మ కథ 'నా స్నేహితురాలు' ప్రత్యేక బహుమతులకు ఎంపికయ్యాయి. వీటితో పాటు మరో పది కథలను సాధారణ ప్రచురణకు ఎంపిక చేసి ఒక సంపుటిగా ప్రచురించాలని ఖమ్మం ఈస్తటిక్స్ కమిటీ నిర్ణయించింది.

– రవి మారుత్, ఖమ్మం ఈస్తటిక్స్

జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు 2023

గుంటూరు 'రావి రంగారావు సాహిత్య పీఠం' ఎనిమిదేళ్లుగా నిర్వహిస్తున్న 'జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు' 2023 వివరాలు ప్రకటించింది. 2019 నుంచి 2023 వరకు ప్రచురించిన పద్యం/ వచన కవిత/ దీర్ఘ కవిత/ గేయం/ లఘు కవితలు మొదలైన కవిత్వ సంపుటాలు ఆహ్వానిస్తోంది. పోటీకి ఒక్క పుస్తకం పంపితే చాలు. ఎంపికైన పుస్తకాల కవులకు ఒక్కొక్కరికి రూ.రెండు వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో 2024 ఫిబ్రవరిలో గుంటూరులో జరిగే సాహిత్య సభలో సత్కరించటం జరుగుతుంది. పుస్తకాలను 'కన్వీనరు, రావి రంగారావు సాహిత్య పీఠం, శంఖుచక్ర నివాస్, అన్నపూర్ణ నగర్ తూర్పు, 5వ లైను, గోరంట్ల, గుంటూరు– 522034'కు డిసెంబర్ 31లోగా పంపవచ్చు.

– నర్రా ప్రభావతి, కన్వీనర్

ఉమ్మడిశెట్టి అవార్డు -2023 కవులకు విజ్ఞప్తి

36వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు – 2023 పరిశీలన కోసం కవులు తమ కవితా సంపుటాలు పంపవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాం. అవార్డు పరిశీలన కోసం 2023లో ప్రచురింపబడిన కవితా సంపుటాలను మొదటి ప్రచురణలు మాత్రమే పంపాలి. న్యాయ నిర్ణేతల చేత ఎంపిక చేయబడిన ఉత్తమ కవితా సంపుటికి రూ.6 వేల నగదు, షీల్డ్‌తో కవికి సత్కారం ఉంటుంది. 10 –01 –2024 లోగా నాలుగు ప్రతులు పంపాలి. చిరునామా : డా. రాధేయ అవార్డు వ్యవస్థాపకులు, 13 – 1 –606 –1 షిర్డీ నగర్, రెవిన్యూ కాలనీ, అనంతపురం –515001

– రాధేయ

26న ఆజాదీ ఆవిష్కరణ

కరిపె రాజ్‌కుమార్ కవితా సంపుటి 'ఆజాదీ' ఆవిష్కరణ సభ నవంబర్ 26, 2023 ఆదివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాదు బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. సభకు డా. రూప్‌కుమార్ డబ్బీకార్ అధ్యక్షత వహిస్తారు. పుస్తకాన్ని కె.ఆనందాచారి ఆవిష్కరిస్తారు. సభలో డా. కాంచనపల్లి గోవర్ధనరాజు, కొమ్మవరపు విల్సన్‌రావు, ఎం. నారాయణశర్మ ప్రసంగిస్తారు.

– పాలపిట్ట బుక్స్

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

వాళ్ళు

1
వాళ్ళే నక్షత్రాల చెట్ల కిందో
హాయిగా ఆడుకునేవాళ్ళు
కాళ్ళు బారజాపుకుని వాళ్ళాడుకుంటుంటే
గ్రహాలు వాటి నడకల్ని సర్దుకునేవి
పాలపుంతల అంచులు మీదుగా
పాటలు పాడుకుంటూ వాళ్ళు సాగిపోతుంటే
ఆ సందడిలో కాలం తప్పిపోయేది
వాళ్ళ అమాయకపు నవ్వుముఖాలతో
దిగంతాలు వెలిగేవి
వాళ్ళ చిట్టి రెక్కల మీద రంగువిల్లులు విరబూసేవి

2
అందమైన నేలుందని కదా
వాళ్ళనిక్కడికి ఆహ్వానించాం
ఏ రక్తపు మరకలూ అంటని పొత్తిళ్ళను
ఏ విభజన రేఖలూ లేని ప్రపంచాన్ని కదా
వాళ్ళకు వాగ్దానం చేశాం
పాటలు పాడే నదులతో సహా
నీలిసముద్రాల మీద కురిసే వెన్నెలంతా
వాళ్ళదేనని కదా ఆశ పెట్టాం
ఇక్కడ విరిసే ప్రతి పువ్వు మీదా
రెక్క విప్పుకునే ప్రతి ఉదయం మీదా
వాళ్ళదే అధికారమని కదా నమ్మబలికాం

3
మొదట, వాళ్ళు ఆడుకునే మైదానాల మీద
మన ఇష్టానికి కొన్ని గీతలు గీసాం
అచ్చం అరణ్యాల మీదా, శిఖరాల మీదా
అలవాటుగా అడ్డదిడ్డంగా గీసినట్టుగానే !
రంగులుగా విడగొట్టాం
మతాలుగా, జాతులుగా విడగొట్టినట్టే !

వాళ్లు నేలంతా బొమ్మలు గీయాలని చూస్తారు
మనం ఎరేజర్లను తయారుచేస్తాం
వాళ్ళు బడిని తోటనుకుని పూలసజ్జలతో వస్తారు
మనం తుపాకుల కళ్ళతో గది గదినీ గాలిస్తాం
వాళ్ళు చేతుల నిండా
స్వప్నాలను పట్టుకుని మేల్కొంటారు
మనం వాళ్ళ స్వప్నాలను లాక్కొని
ఖాళీ చేతులతో వెళ్లగొడతాం
వాళ్ళు మెరిసే నవ్వులతో
రోజుకో సూర్యుడ్ని వేలాడదీస్తారు
మనం ఆరిపోయిన దీపాల్ని తెల్లని బట్టల్లో చుట్టి
కన్నవాళ్ళకి అప్పగిస్తాం
ఎడతెరిపిలేని యుద్ధంలో
వాళ్ళు పుస్తకాల్ని వెతుక్కుంటుంటే
మనం తెగిన శత్రువుల తలల్ని లెక్కలేసుకుంటుంటాం

4
వాళ్ళేదో రోజు
అలిగి ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్ళిపోతారు
వెళ్తూ వెళ్తూ దేవుణ్ణి కూడా వెంట తీసుకుపోతారు
అప్పుడిక
ఈ మృతగ్రహంమీద జీవించడానికి
ఒక్కటంటే ఒక్క కారణమూ దొరకదు

– రాధ



నయవంచన

ఓట్ల జాతర ముందు
మా అవసరం నువ్వు
అందలం ఎక్కించే నిచ్చెనవు కదా
ఎన్నికల పందేరం ముగిసాక
మా జెండా వేరు, ఎజెండా కూడా వేరే!

అధికార పీఠం అధిరోహించాక
ఆదర్శాలన్నీ తారుమారు
అసమ్మతి స్వరం దేశద్రోహం
లౌకిక తత్వం ప్రతిపక్ష అరాచకత్వం
సమ సమాజం విదేశీ కుట్ర

విద్వేష ప్రసంగాలతో
భావోద్వేగాల వలయాల్లో చిక్కుకున్న జనం
సోషల్ మీడియాలో కూర్చుని
పోరాడే వర్చువల్ దేశభక్తులు
మెజారిటీ, మైనారిటీ బుజ్జగింపు రాచకీయాలు
మా పురోగమనానికి సోపానాలు

జాతి సంపద మొత్తం అంగట్లో అమ్మకపు సరుకు
శ్రమజీవుల ఘర్మజలం సర్వం కార్పొరేట్ పూజకు
అభిషేకం
మా రాచకీయ చదరంగాన కొత్త ఎత్తుగడ ఇదే !
ఏకతా శిల్పాల రూపకల్పన మా అభివృద్ధి ఎజెండా
మందిరాలు, మసీదులు ఓట్లు రాల్చే కల్ప తరువులు
రేపటి మా గెలుపుకు రహదారులు

ఎవరూ భుజాలు తడుముకోకండి
ఇది సార్వజనీన సూత్రం
మాది సర్వజనుల గళం !

– వినిశ్రీ
97013 48825

తీరం

ఇసుక తీరమంతా
ఇంకిన కన్నీళ్లే
కనుకనే
తాకి వెళ్లిన సాగరానికి
తనువంతా ఉప్పు నీళ్లే !

ఒడ్డున నిలిచిన శిలలన్నీ
ఒట్టిపోయిన తీపి కలలే
కనుకనే
చుట్టుముట్టిన అలల సడిలో
హోరెత్తిన అలజడులే!

– డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ,
94408 36931

'అదానీ జీకి జై' అని నినాదాలివ్వండి

- మోడీకి రాహుల్ సూచన

జైపూర్ : 'ప్రధాని నరేంద్ర మోడీ భారత్ మాతా కీ జై బదులు అదానీ జీ కీ జై' అని నినాదాలివ్వాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సూచించారు. రాజస్థాన్‌లోని బుండీ, దౌసా జిల్లాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల సభల్లో ఆయన మాట్లాడారు. అదానీ కోసం ప్రధాని 24 గంటలూ పనిచేస్తున్నారని అన్నారు. మోడీ విధానాలు రెండు వేర్వేరు భారత దేశాలను సృష్టిస్తున్నాయని చెప్పారు. ఒకటి అదానీ ప్రయోజనాలను పరిరక్షించడం, రెండోది పేదలు, అణగారిన వర్గాలకు నష్టం చేయడం అని అన్నారు. రాజస్థాన్‌లో మళ్ళీ అధికారంలోకి రాగానే కులగణన నిర్వహిస్తామని తెలిపారు. 'రోజుకు మూడుసార్లు బట్టలు మార్చుకుంటారు. కోట్ల విలువైన విమానాలు, కార్లలో ప్రయాణిస్తారు. వెనుకబడిన తరగతుల వారి జనాభా తెలుసుకోవాలనుకున్నట్లు కులం లేదని చెబుతారు' అంటూ మోడీపై మండిపడ్డారు. జనాభాలో సగం మంది ఉన్నప్పటికీ ఇతర వెనుకబడిన తరగతులకు ఉన్నతస్థాయి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. పెద్ద పారిశ్రామిక వేత్తలు ఎవరూ లేరని చెప్పారు.

మహిళల ఖాతాల్లోకి ఏటా రూ.10 వేలు

రాజస్థాన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మళ్లీ గెలిపిస్తే మహిళల బ్యాంకు ఖాతాల్లో ఏటా రూ.10 వేలు బదిలీ చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. గ్యాస్ సిలిండర్ రూ.500 చొప్పున అందజేస్తామని చెప్పారు. రాజస్థాన్ అంతటా ఇంగ్లీష్ మీడియం స్కూళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. మోడీ రద్దు చేసిన పాత పెన్షన్ విధానాన్ని రాజస్థాన్‌లో పునరుద్ధరించిన విషయాన్ని గుర్తు చేశారు.

ఏ బాధ్యతలన్నది అధిష్టానమే నిర్ణయిస్తుంది : సచిన్ పైలట్

జైపూర్ : పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఎవరికి ఏ బాధ్యతలు అప్పగించాలనేది కాంగ్రెస్ అధిష్టానమే నిర్ణయిస్తుందని రాజస్థాన్ సిఎం రేసులో ఉన్న సచిన్ పైలట్ తెలిపారు. ఎన్నికల్లో సమిష్టిగా పోరాడుతున్నామని చెప్పారు. ప్రజలు తమను ఆశీర్వదించి, మరోసారి పాలనా పగ్గాలు అప్పగిస్తే, ఎమ్మెల్యేలతో చర్చించిన అనంతరం హైకమాండ్ పదవులపై ఓ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అభ్యంతరాలుంటే పార్టీ నాయకత్వంతో మాట్లాడి పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. 2018లో ఇదే విధానం అనుసరించామని, ఇప్పుడు కూడా దీన్నే అనుసరిస్తామని అన్నారు.

కార్మికులు సొరంగంలో చిక్కుకుపోతే ప్రచారంలో యోగి బిజీ : అఖిలేష్‌యాదవ్

లక్నో : ఉత్తరకాశీ సొరంగంలో చిక్కుకున్న ఎనిమిదిమంది ఉత్తర ప్రదేశ్ కార్మికులను కాపాడటంలో యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, మాజీ సిఎం అఖిలేష్‌యాదవ్ విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో సిఎం యోగి బిజీగా ఉన్నారని అన్నారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికులందరినీ సురక్షితంగా బయటకు రప్పించడం బిజెపి ప్రభుత్వ బాధ్యతని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ ఆపద సమయంలో యుపికి చెందిన ఎనిమిదిమంది కార్మికుల కుటుంబాలకు అండగా ఉండాలని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా సిఎం యోగి అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కార్మికులను కాపాడేందుకు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని తెలిపారు.

హలాల్ లేబుల్‌పై నిషేధం

- యోగి ప్రభుత్వం ఆదేశం

లక్నో : పాల ఉత్పత్తులు, చక్కెర, బేకరీ వస్తువులు, పిప్పరమెంట్ ఆయిల్, స్నాక్ ఐటెమ్స్, ఎడిబుల్ ఆయిల్ వంటి ఉత్పత్తులపై హలాల్ లేబుల్ ప్రచురించడంపై యోగి ప్రభుత్వం నిషేధం విధించింది. రాష్ట్రంలో హలాల్ బ్రాండెడ్ వస్తువుల ఉత్పత్తి, నిల్వ, పంపిణీని నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. ఆహార ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించడంపై 2006లో చేసిన చట్టానికి విరుద్ధమని రాష్ట్ర ఆహార కమిషనర్ కార్యాలయం శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. హలాల్ లేబుల్ వినియోగదారులలో గందరగోళాన్ని సృష్టిస్తుందని యోగి ప్రభుత్వం ఆరోపించింది. ఆహార ఉత్పత్తుల నాణ్యతపై రాష్ట్ర ప్రభుత్వ న్యాయ సూత్రాలకు విరుద్ధమని కమిషనర్ అనితాసింగ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వినియోగదారుల మధ్య గందరగోళాన్ని సృష్టించడం చట్ట ప్రకారం శిక్షార్హమైన నేరమని పేర్కొంది.

తారానగర్‌లో సభలో మాట్లాడుతున్న బృందాకరత్

రాజస్థాన్‌లో సిపిఎం విస్తృత ప్రచారం

తారానగర్ సభలో పాల్గొన్న బృందాకరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సిపిఎం అభ్యర్థుల ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. చురు జిల్లా తారానగర్‌లో కిసాన్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిర్మల్ కుమార్‌కు మద్దతుగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ ప్రచారం చేశారు. వివిధ సభల్లో పాల్గొని ప్రచారం చేశారు. నిర్మల్ కుమార్‌కు లభిస్తున్న బలమైన మద్దతును తగ్గించడానికి ఈ నియోజకవర్గంలో భారీగా డబ్బు ఖర్చు చేస్తూ ప్రైవేట్ బీమా కంపెనీ అనుకూల, కులతత్వ శక్తులు ముఠాగా ఉన్నాయని విమర్శించారు. బహిరంగ సభకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

కాంగ్రెస్ అవినీతిని తరిమికొట్టండి : మోడీ

జైపూర్ : కాంగ్రెస్ హయాంలో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు దోరణి మాత్రమే ఉంటాయని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. తారానగర్, జుంఝూ్ను తదితర ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. అశోక్ గెహ్లాట్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను లూటీ చేస్తోందని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలతో పోలిస్తే రాజస్థాన్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ గెలిచే పరిస్థితి లేదని అన్నారు.

రాజస్థాన్ హుందాతనాన్ని, గౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. షహపురలో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద, విశ్వసనీయ పార్టీ బిజెపి అని అన్నారు.

రాజ్యాంగ నైతికతను తిరస్కరించకూడదు

- రాజ్యాంగానికి సవరణలు అవసరమే
- కొన్ని సందర్భాల్లో కోర్టులు జోక్యం చేసుకుంటాయి
- ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్

న్యూఢిల్లీ : రాజ్యాంగ నైతికత సిద్ధాంతాన్ని తిరస్కరించకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ అన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రస్తుత సామాజిక ఆచరణ పద్ధతుల కారణంగా రాజ్యాంగ నైతికత ఉద్రిక్తతకు లోనవుతోందన్న కారణంతో దానిని తిరస్కరించడం తగని పని అని చెప్పారు. రాజ్యాంగ నైతికత ద్వారా భారతీయ సాంస్కృతిక పద్ధతులను పరిశీలించేటప్పుడు వైరుధ్యాలు తలెత్తే అవకాశంపై అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ కొన్ని రాజ్యాంగ విలువలు ఆమోదయోగ్యమైనవని తెలిపారు. రాజ్యాంగ నిర్మాతలు ఇతర దేశాలకు చెందిన రాజ్యాంగాల్లోని కొన్ని నిబంధనల్ని మన పరిస్థితులకు అనువుగా మార్చి భారత రాజ్యాంగంలో చేర్చారని వివరించారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికకు ఆయన ఇంటర్వ్యూ ఇస్తూ మతం, కులం, జాతి కారణంగా పౌరులపై పెత్తనం చెలాయించేందుకు వీలు లేకుండా సామాజిక ఆచరణ పద్ధతుల్ని సంస్కరించాలని రాజ్యాంగమే చెబుతోందని అన్నారు.

అంటరానితనం నిర్మూలన, ప్రభుత్వ విధాన ఆదేశిక సూత్రాలు వంటి అనేక రాజ్యాంగ నిబంధనలు మన దేశంలో అందరికీ ఒకటేనని చంద్రచూడ్ చెప్పారు. ఉచిత న్యాయ సహాయం, పంచాయతీల ద్వారా స్థానిక పాలన, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై చట్టాలు చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వంపై ఉంచుతూ ఆదేశిక సూత్రాలను రూపొందించారని గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాణం తర్వాత దానిని వందసార్లకు పైగా సవరించారని తెలిపారు. రాజ్యాంగ సవరణల ద్వారా మాత్రమే పంచాయతీలు, జిఎస్‌టి మండలి వంటి ప్రభుత్వ నిర్మాణాలు ఏర్పడ్డాయని చెప్పారు. రాజ్యాంగం అనేది విలువలతో కూడిన పత్రమని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆ సూత్రాలను నిరంతరం సవరిస్తూనే ఉండాలని అభిప్రాయపడ్డారు.

న్యాయమూర్తుల నియామకం విషయంలో సుప్రీంకోర్టు కొలీజియం భిన్నత్వానికి ప్రాధాన్యత ఇచ్చిందని చంద్రచూడ్ అన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తుల్లో మహిళల సంఖ్య తక్కువగా ఉండడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థలో ఈ పద్ధతి మారుతోందని అంటూ అనేక రాష్ట్రాల్లో జరిగిన జ్యుడీషియల్ సర్వీస్ పరీక్షల ఫలితాలను ఆయన ఉదాహరణగా చూపారు. పార్లమెంట్, న్యాయస్థానం వేర్వేరు సంస్థాగత నిర్మాణాలని, వాటికి వేర్వేరు అధికారాలు ఉన్నాయని చెప్పారు. 'కొన్ని సందర్భాల్లో కోర్టులు జోక్యం చేసుకోవాల్సిన విషయాలు ఉంటాయి. ఉదాహరణకు పార్లమెంట్ సామాజిక మార్పుల కోసం బిల్లుల్ని ఆమోదిస్తుంది. అయితే హక్కుల ఉల్లంఘనకు సంబంధించి వ్యక్తిగత కేసులను అడ్డుకోవడానికి ఆ బిల్లుల్ని ఉద్దేశించలేదు. సమస్యల పరిష్కారానికి సంస్థాగత పాత్ర, సామర్థ్యం ఆధారంగా పౌరులు తమకు నచ్చిన వేదికల్ని ఎంచుకోవచ్చు' అని తెలిపారు. పార్లమెంట్, న్యాయ వ్యవస్థ తరచూ పరస్పరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలని చంద్రచూడ్ అన్నారు.

22 మంది భారత మత్స్యకారుల విడుదల

చెన్నై : తమిళనాడులోని రామేశ్వరానికి చెందిన 22 మంది మత్స్యకారులను శ్రీలంక ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. తమ ప్రాదేశిక జలాల్లో ప్రవేశించి చేపల వేట జరుపుతున్నారని ఆరోపిస్తూ, శనివారం వీరిని శ్రీలంక అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మత్స్యకారులకు చెందిన రెండు పడవలను కూడా విడుదల చేశామని కంట్రీ బోట్ జాలర్ల సంఘం అధ్యక్షుడు రాయప్పన్ రామేశ్వరంలో విలేకరులకు తెలిపారు. పిఎం స్వనిధి కార్యక్రమంలో పాల్గొనేందుకు నిర్మలా సీతారామన్ శనివారం రామేశ్వరం చేరుకున్నారు. మత్స్యకారులను, వారి పడవలను విడిపించేందుకు జోక్యం చేసుకోవాలని కోరుతూ శనివారం సాయంత్రం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశామని చెప్పారు. నిర్మలా సీతారామన్ ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల కార్యదర్శితోపాటు శ్రీలంకలోని భారత హై కమిషనర్‌తో మాట్లాడారని తెలిపారు. అరెస్ట్ చేసిన మత్స్యకారులను శ్రీలంక అధికారులు ఐఎంబిఎల్ వద్ద అప్పగించారని, వారు స్వదేశానికి తిరిగి వస్తున్నారని చెప్పారు. 2018 నుండి శ్రీలంక అదుపులో ఉన్న మరో మత్స్యకారుడు నంబు మురుగన్‌ను విడుదల చేయాలని మరో మత్స్యకారుడు పి. జెసు రాజా ఆర్థికమంత్రిని కోరారు. ఆయనతోపాటు 118 బోట్‌లను కూడా శ్రీలంక స్వాధీనం చేసుకుందని తెలిపారు.

జబాలియా శరణార్థి శిబిరంపై దాడి

- 200 మంది మృతి

గాజా సిటీ: గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ వరుసగా మూడు రోజులపాటు జరిపిన బాంబు దాడుల్లో 200 మంది చనిపోయారు. శనివారం ఒక్కరోజే రెండు దాడుల్లో 80 మంది చనిపోయారు. వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నారు. మృతి చెందిన వారిలో 19 మంది చిన్నారులు సహా ఒకే కుటుంబానికి చెందిన 32 మంది ఉన్నారు. ఆరు వారాల యుద్ధంలో 16 లక్షల మంది పాలస్తీనియన్లు నిరాశ్రయులైన గాజాలోని అతిపెద్ద శరణార్థుల శిబిరంపై ఇజ్రాయెల్ దాడి చేస్తూనే ఉంది. గాజాలోని అల్-ఫఖురా పాఠశాలపై జరిగిన దాడిలో కనీసం 50 మంది మరణించారు. ఇది యుద్ధం ప్రారంభమైనప్పుడు శరణార్థుల కేంద్రంగా మార్చబడిన పాఠశాల. శనివారం తెల్లవారుజామున ఈ దాడి జరిగింది. అదే సమయంలో, ఇజ్రాయెల్ సైన్యం స్వాధీనం చేసుకున్న అల్ షిఫా ఆసుపత్రి నుండి ప్రజలను భారీగా తరలిస్తున్నారు. రోగులు, ఆరోగ్య కార్యకర్తలు, శరణార్థులతో సహా 7,000 మందికి పైగా ప్రజలు ఇక్కడ ఉన్నారు. ప్రజలు గుంపులుగా బయటకు వెళ్తున్న దృశ్యాలను అంతర్జాతీయ మీడియా శనివారం విడుదల చేసింది. శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించింది.నాలుగో రోజు కూడా ఇజ్రాయెల్ సైన్యం ఆసుపత్రిలో మకాం వేసింది. 120 మంది రోగుల పరిస్థితి విషమంగా ఉందని, నవజాత శిశువులు ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్నారని హమాస్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

అయితే, ఇజ్రాయెల్ మాత్రం తాము తరలింపు ఉత్తర్వు జారీ చేయలేదని వాదిస్తోంది. ఇజ్రాయెల్ సైన్యం హమాస్ కేంద్రంగా ఉందని ఆరోపిస్తూ ఆసుపత్రిని పాక్షికంగా కూల్చివేస్తోంది.దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లోని హమద్ పట్టణంలో ఇజ్రాయెల్ బాంబు దాడిలో చిన్నారులతో సహా 28 మంది మరణించారు. గాజాలో ఇప్పటివరకు జరిగిన యుద్ధంలో మరణించిన వారి సంఖ్య 12,000 కు చేరుకుంది. గాజాలోని ఐక్యరాజ్య సమితి ఏజెన్సీలు శనివారం రఫా సరిహద్దు మీదుగా ఒక ట్రక్కు ఇంధనం అందిందని తెలిపాయి.

ఇజ్రాయెల్ అల్యూమినియం ప్లాంట్‌పై క్షిపణి దాడి

దక్షిణ లెబనాన్‌లోని ఇజ్రాయెల్ అల్యూమినియం ప్లాంట్‌పై క్షిపణి దాడి చేసింది. నబాతిహ్ పట్టణంలోని ప్లాంట్‌పై శనివారం రెండుసార్లు దాడి జరిగింది. గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, లెబనీస్ సరిహద్దులో సాయుధ సమూహం హిజ్బుల్లాతో పోరాటం తీవ్రంగా ఉంది.

గాయపడిన పాలస్తీనా చిన్నారులు అరబ్ ఎమిరేట్స్‌కు చేరుకున్నారు. ఇజ్రాయెల్ దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారులతో తొలి విమానం యూఏఈకి చేరుకుంది. గాజాలో గాయపడిన 1,000 మంది చిన్నారులకు చికిత్స అందించేందుకు యూఏఈ ముందుకొచ్చింది. దీని ప్రకారం, గాయపడిన పిల్లలు మరియు కుటుంబ సభ్యులతో సహా 15 మందితో కూడిన మొదటి విమానం అబుదాబికి చేరుకుంది. ఇందులో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పిల్లలు కూడా ఉన్నారు. దాడిలో కుటుంబ సభ్యులందరినీ కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయిన పిల్లలు కూడా ఈ బందంలో ఉన్నట్లు సమాచారం.

గాజాలోని అతి పెద్ద ఆసుపత్రి అల్ షిఫా సందర్శించి అక్కడి పరిస్థితులు తెలుసుకుంటున్న డబ్ల్యుహెచ్ఓ బృందం

అది ఓ మృత్యు నిలయం

- అల్ షిఫా ఆస్పత్రిలో పరిస్థితిపై డబ్ల్యుహెచ్ఓ

గాజాలోని అతి పెద్ద ఆసుపత్రి అల్ షిఫా ఓ 'మృత్యు నిలయం'గా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) అభివర్ణించింది. అక్కడి పరిస్థితి చెప్పనలవి కాదని తెలిపింది. డబ్ల్యుహెచ్ఓ నేతృత్వంలోని బృందం శనివారం ఆస్పత్రిని సందర్శించింది. భద్రతా కారణాల దృష్ట్యా అక్కడ కేవలం ఓ గంట సేపు మాత్రమే గడిపింది. ఈ బృందంలో ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రజారోగ్య నిపుణులు, అధికారులు, భద్రతా సిబ్బంది సభ్యులుగా ఉన్నారు. ఆస్పత్రిలో స్వచ్ఛమైన నీరు, ఇంధనం, మందులు, ఇతర అత్యవసరాలకు తీవ్ర కొరత ఏర్పడిందని ఈ బృందం వివరించింది. వాస్తవానికి ఓ వైద్య కేంద్రంగా ఇది పనిచేయడం లేదని తెలిపింది.

'కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయి. తూటాలు దూసుకొస్తున్నాయి. ఆస్పత్రి ప్రాంగణం సామూహిక శ్మశాన వాటికలా కన్పించింది. అక్కడ 80 మందికి పైగా మృతులకు అంత్యక్రియలు నిర్వహించారని చెప్పారు' అని డబ్ల్యుహెచ్ఓ ఓ ప్రకటనలో వివరించింది. ఈ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం... ఆస్పత్రిలోకి ప్రవేశించే మార్గాలు, ఆస్పత్రి మైదానం మొత్తం వ్యర్థాలతో నిండిపోయింది. ఎక్కడ చూసినా భరించలేని దుర్వాసన వస్తుండడంతో తమ ఆరోగ్యం, భద్రతపై రోగులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరవై ఐదు మంది ఆరోగ్య కార్యకర్తలు, 291 మంది రోగుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వీరిలో 32 మంది చిన్నారులు కూడా ఉన్నారు. ఆస్పత్రిలో మిగిలి ఉన్న రోగులు, వారి బంధువులు, ఆరోగ్య సిబ్బందిని అక్కడ నుండి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాబోయే 24-72 గంటల్లో వారందరినీ సురక్షితంగా వేరే ప్రదేశాలకు పంపుతామని, ముఖ్యంగా రోగులను గాజాకు దక్షిణాన ఉన్న ఆస్పత్రుల్లో చేరుస్తామని అధికారులు తెలిపారు. డబ్ల్యుహెచ్ఓ ప్రకటనపై ఇజ్రాయిల్ ఇప్పటి వరకూ ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. ఆస్పత్రి ప్రాంగణాన్ని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇజ్రాయిల్ రక్షణ దళాలు హెచ్చరికలు పంపడంతో అల్ షిఫా మైదానంలో ఆశ్రయం పొందుతున్న 2,500 మంది బాధితులు అక్కడి నుండి వెళ్లిపోయారు. ఆస్పత్రి సమీపంలో భీకర పోరు సాగుతోందని, ఇజ్రాయిల్ సైన్యంతో సమన్వయం చేసుకొని తాము ఆస్పత్రిలోకి వెళ్లామని డబ్ల్యుహెచ్ఓ తెలిపింది. వెంటనే కాల్పుల విరమణ పాటించాలని, ఆపన్నులకు మానవతా సాయాన్ని అందించాలని ఆ సంస్థ మరోసారి విజ్ఞప్తి చేసింది.

ప్రజాసమస్యలే సిపిఎం అజెండా

- ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి ఓటమే ధ్యేయం : విజయ్ రాఘవన్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యలే అజెండాగా సిపిఎం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపి విజయ్‌రాఘవన్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి ఓటమే ధ్యేయంగా తమ పార్టీ ముందుకెళ్తోందని చెప్పారు. బిజెపి ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇస్తోందని, రాజ్యాంగేతర శక్తిగా మారిందని విమర్శించారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బిజెపిని ఓడించే ప్రజాస్వామ్య శక్తులకు మద్దతు ఇస్తూనే తాము బలంగా ఉన్న 19 స్థానాల్లో పోటీ చేస్తున్నామని వివరించారు. సిపిఐకి ఒక సీటులో మద్దతు ఉందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం లౌకిక, ప్రజాస్వామ్య విలువలను విడనాడిందని, రాజ్యాంగేతర శక్తిగా మారిందని విమర్శించారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉండాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. బిజెపి పాలనలో దళితులు, కార్మికులు, కర్షకులపై భారాలు అధికమయ్యాయని, అన్ని తరగతుల ప్రజలూ సంకటస్థితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్య, వైద్యం ప్రయివేట్‌పరం అయ్యాయని తెలిపారు. కానీ, కేరళలో ఈ రెండూ ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయని వివరించారు. కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ విధానాలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కమ్యూనిస్టులు పోటీ చేస్తున్న 20 స్థానాల్లో బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలని కోరారు. ఈ ఎన్నికలు అఖిలభారత స్థాయిలో ప్రభావితం చూపుతాయన్నారు. తెలంగాణలో 17 శాతంగా ఉన్న దళితుల్లో 60 శాతం మందికి భూమిలేదని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. బిజెపి బిసి ముఖ్యమంత్రి అంటుందే తప్ప, బిసిల సమస్యలపై ఆ పార్టీకి ఏ మాత్రమూ చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సమావేశంలో సిపిఎం జాతీయ నాయకులు ఎం.సాయిబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేశ్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దళిత యువకులపై దాడి

చెన్నై : తమిళనాడులోని వేలూరు జిల్లాలో ఇద్దరు దళితులపై దాడికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 14న సతుమదురై రైల్వే గేటు దగ్గర ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్లడంతో కనియంబాడికి చెందిన తులసీరామన్ కుమారుడు దివాకర్ (26)ను ఇద్దరు వ్యక్తులు అసభ్యపదజాలంతో దూషించారు. వారిని అనుసరించిన దివాకర్ తనను తిట్టడంపై వివరణ అడిగాడు. దీంతో వారు దివాకర్‌తో వాగ్వాదానికి దిగారు. మరో ఇద్దరు మిత్రులతో కలిసి దివాకర్‌పై దాడి చేశారు. దీంతో దివాకర్ తలకు గాయాలయ్యాయి. గొడవను చూసిన దివాకర్ ఇంటి దగ్గరి వ్యక్తి శరవణన్ అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. యనపై కూడా బీరు సీసాలు, రాళ్లతో దాడి చేశారు. దాడిలో శరవనణ్ బట్టలు చిరిగిపోయాయి. అతని ఛాతీపై అంబేద్కర్ పచ్చబొట్టు కనిపించింది. అది చూసిన నిందితుడు.. శరవణన్ ఎస్సీ వర్గానికి చెందినవాడని గ్రహించి ఆగ్రహంతో ఆయనపై, దివాకర్‌పై తీవ్రంగా దాడి చేశారు. శరవణన్ స్పృహ కోల్పోవడంతో నలుగురు దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. చుట్టుపక్కల ప్రజలు బాధితులిద్దరినీ వేలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో నలుగురు వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. శరవణన్ తలకు 13 కుట్లు పడ్డాయి. ఆయన మాట్లాడుతూ.. "నా ఛాతీపై పచ్చబొట్టును గమనించి వారు నాపై తీవ్రంగా దాడి చేశారు. వారు మమ్మల్ని కులం పేరుతో తిట్టారు. నేను ఇప్పుడు నడవవలేకపోతున్నాను. దివాకర్‌కి ఏడు కుట్లు పడ్డాయి" అని తెలిపారు. ఈ ఘటనపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి. నిందితులను ఆకాష్, విజయ్, సతీష్‌కుమార్, తమిళ్‌సెల్వన్‌గా పోలీసులు గుర్తించారు. తమిళ్‌సెల్వన్ కోసం గాలిస్తున్నామని, ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య ఒప్పందం కుదరలేదు : వైట్‌హౌస్

వాషింగ్టన్ : ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య ఇప్పటివరకు ఎలాంటి ఒప్పందం కుదరలేదని వైట్ హౌస్ స్పష్టం చేసింది. ఇరుపక్షాల మధ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు అమెరికా కృషి కొనసాగిస్తోందని అధికార ప్రతినిధి ఒకరు శనివారం రాత్రి తెలిపారు. గాజాపై యుద్ధం ఏడవవారంలోకి ప్రవేశించడంతో.. హమాస్ పాలనలో ఉన్న గాజా స్ట్రిప్‌లో 5,000 మంది చిన్నారులతో సహా 12,300 మంది మరణించారు. దక్షిణ గాజాపై ఇజ్రాయిల్ దాడికి సిద్ధమవుతున్నట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది.

గాజాను పాలస్తీనా అథారిటీ పాలించాలి : బైడెన్

ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం తర్వాత వెస్ట్‌బ్యాంక్, గాజాను పాలస్తీనా అథారిటీ పరిపాలించాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్ శనివారం వ్యాఖ్యానించారు. యుద్ధం అనంతరం గాజా విషయంలో అమెరికా అభిప్రాయాన్ని బైడెన్ వాషింగ్టన్ పోస్ట్‌లోని ఓ ఆర్టికల్‌లో వెల్లడించారు. గాజా ప్రాంతం మొత్తానికి సైనిక రక్షణ బాధ్యతలను తాము చూస్తామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ గతంలో పేర్కొన్న సంగతి తెలిసిందే.

మృత్యువుతో అంతులేని పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

ముందడుగేమి లేదు. దేశంలోని అత్యున్నత సాంకేతికతను, అందుబాటులో ఉన్న నిపుణులను అక్కడికి తరలించారా అంటే, ఆ చర్యలు నామమాత్రమే! ఆదివారం నాడు కూడా అధికారుల తర్జన భర్జనలే దీనికి నిదర్శనం. ఇటువంటి సంఘటనలు ప్రపంచంలో ఏ మూల జరిగినా పుంఖానుపుంఖాలుగా కథనాలు ప్రచురించే కార్పొరేట్ మీడియా ఉత్తరాఖండ్ సంఘటనను మాత్రం చూసీచూడనట్లు వదిలేసింది. అక్కడ డబుల్ ఇంజిన్ సర్కారు ఉండటమే మీడియా పట్టించుకుపోవడానికి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏం జరిగింది...?

ఈ నెల 12వ తేది సొరంగ నిర్మాణ పనులు జరుగుతుండగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో సొరంగం కొంత మేర కూలిపోయింది. సొరంగ పనులు నిర్వహిస్తున్న 41 మంది కార్మికులు ఆ శిథిలాల కింద చిక్కుకుపోయారు. సొరంగ ప్రవేశ మార్గానికి 200 మీటర్ల దూరంలో ఈ దుర్ఘటన జరిగింది.

కొలిక్కిరాని యత్నాలు..

చిక్కుకుపోయిన వారిని త్వరగానే కాపాడగలుగుతామని తొలుత అధికారులు భావించారు. అయితే రోజులు గడిచే కొద్దీ పరిస్థితి క్లిష్టంగా మారింది. ఇప్పటివరకు 24 మీటర్ల మేర డ్రిల్లింగ్ చేశారు. అయితే, కార్మికులు తప్పించడానికి 60 మీటర్ల మేర డ్రిల్ చేయాల్సిఉంటుందని అంచనా! అయితే, ఈ ప్రక్రియ ఆశించినంత వేగంగా సాగడం లేదు. డ్రిల్ చేసే కొద్దీ సొరంగం కుప్పకూలుతోంది. దీంతో పనులు నిలిపివేశారు. ఒక పైపును ఏర్పాటు చేసి దానిద్వారా చిక్కుకున్న కార్మికులకు ఆహారం, నీటిని అందచేస్తున్నారు. దీని ద్వారానే కార్మికులతో అప్పుడప్పుడు మాట్లాడుతున్నారు. కార్మికులు నీరసించిపోయారని, కొందరు అసలు మాట్లాడటం లేదని వారితో మాట్లాడుతున్న అధికారులు చెబుతున్నారు.

శుక్రవారం నిలిచిన సహాయ పనులు

అమెరికాకు చెందిన ఆగర్ డ్రిల్లింగ్ యంత్రంతో శుక్రవారం ఐదో పైపును అమరుస్తున్న సమయంలో భారీ పగుళ్లు ఏర్పడ్డాయి. పెద్ద శబ్దం కూడా విన్పించింది. యంత్రం ప్రకంపనల కారణంగా సొరంగం పైభాగం నుండి శిథిలాలు పడి ఉంటాయన్న అనుమానంతో పనులు నిలిపేశారు. ఆదివారం నాడు కూడా ఇదేస్థితి కొనసాగింది. కొండ పై భాగం నుండి కార్మికులు ఉన్న చోటుకు నిలువుగా డ్రిల్లింగ్ చేయాలని నిర్ణయించారు. ముందుగా కొండ పైభాగంలో రంధ్రాన్ని చేస్తారు.అయితే కొండ పైకి డ్రిల్లింగ్ యంత్రాన్ని చేర్చడానికి రెండు, మూడు రోజులు సమయం పడుతుందని అంచనా. అందుకోసం రోడ్డును కూడా నిర్మించాల్సి ఉంటుంది. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుండి బోయింగ్ రవాణా విమానం ద్వారా మరో డ్రిల్లింగ్ యంత్రాన్ని తీసుకొచ్చి, విడిభాగాలను కలిపే పనిలో ఉన్నారు.

నమ్మకం పోతోంది : బాధితుని సోదరుడు

తమను బయటకు తీసుకువస్తారన్న నమ్మకాన్ని కార్మికులు కోల్పోతున్నారని బీహార్‌కు చెందిన శర్మ అనే వ్యక్తి చెప్పారు. ఆయన సోదరుడు సొరంగం కింద చిక్కుకుపోయాడు. ఈ విషయం తెలియడంతో బీహార్ నుండి వచ్చిన ఆయన అధికారులు ఏర్పాటు చేసిన పైపు ద్వారా తన సోదరుడితో మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 'మేము బయటకు వస్తామా అని నా సోదరుడు అడిగాడు. నేనేమి జవాబు చెప్పలేదు.' అని అన్నారు. శుక్రవారం రాత్రి నుండి సహాయక చర్యలేవీ జరగడం లేదని ఓ కార్మికుడి తండ్రి సుఖ్‌రామ్ తెలిపారు. 'నేను గురువారం రాత్రి నుండి ఇక్కడే ఉన్నాను. శుక్రవారం రాత్రి పది గంటలకు యంత్రాలన్నీ ఆగిపోయాయి. అప్పటి నుండి సహాయ సిబ్బంది ఖాళీగానే కూర్చున్నారు' అని ఆయన అన్నారు. సొరంగంలో ఉన్న కార్మికుల మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం కూడా క్షీణిస్తూ ఉండవచ్చునని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. లోపల ఉన్న వారి మాటలు చాలా బలహీనంగా, పేలవంగా ఉంటున్నాయని అక్కడికి చేరిన వారు చెబుతున్నారు.

ఇది అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే!

- క్యూబా దిగ్బంధనంపై ట్రిబ్యునల్ తీర్పు

బ్రస్సెల్స్: క్యూబాపై అమెరికా సాగిస్తున్న ఆర్థిక దిగ్బంధనాన్ని రెండు రోజుల పాటు విశ్లేషించిన అంతర్జాతీయ ట్రిబ్యునల్ ఈ విధానం అంతర్జాతీయ చట్టాలను, శాంతియుత సహజీవనానికి సంబంధించిన విశ్వజనీన విలువలను కాలరాసేదిగా ఉందని అంతర్జాతీయ ట్రిబ్యునల్ ఇటీవల తీర్పునిచ్చింది. మానవ, ఆర్థిక నష్టాలపై ప్రాసిక్యూటర్ కార్యాలయ వాదనలు, సాక్షుల వాంగ్మూలాన్ని విన్న తరువాత, అమెరికా 60 సంవత్సరాలకు పైగా కొనసాగిస్తున్న ఈ ఏకపక్ష బలవంతపు చర్యలు క్యూబన్ల జీవన స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ట్రిబ్యునల్ పేర్కొంది. ఇది అంతర్జాతీయ చట్టానికి విరుద్ధమని పేర్కొంది. జర్మన్ న్యాయవాది నార్మన్ పీచ్ నేతత్వంలోని ట్రిబ్యునల్ ఈ దిగ్బంధనం 1966 ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులకు సంబంధించి అంతర్జాతీయ ఒడంబడికను ఉల్లంఘించేదిగా ఉందని తెలిపింది. క్యూబాపై దిగ్బంధనానికి అంతం పలకాలని, దిగ్బంధనం వల్ల దెబ్బతిన్నకంపెనీలకు, పౌరులకు అమెరికా పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

ఎఐ నియమావళిపై జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ మధ్య ఒప్పందం

బెర్లిన్ : భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు (ఎఐ) నియమావళిపై జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం యూరోపియన్ యూనియన్ స్థాయిలో చర్చలను వేగవంతం చేస్తుందని భావిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన పత్రాలను రాయిటర్స్ ఆదివారం విడుదల చేసింది. యూరోపియన్ యూనియన్‌లోని పెద్ద, చిన్న ఎఐ ప్రొవైడర్ల కోసం మూడు ప్రభుత్వాలు పాటించవలసిన స్వచ్ఛంద కట్టుబాట్లను ఏర్పాటు చేసుకున్నాయి. యూరోపియన్ కమిషన్, యూరోపియన్ పార్లమెంట్, ఇయు కౌన్సిల్ ప్రస్తుతం ఈ కొత్త రంగంలో నిబంధనలు ఎలా ఉండాలనే దానిపై చర్చలు జరుపుతున్నాయి. ఎఐ అప్లికేషన్ భద్రత, వివక్షత ప్రమాదాలను నివారించే లక్ష్యంతోపాటు యూరోపియన్ యూనియన్‌లో ఈ కొత్త సాంకేతికత నెమ్మదించకుండా ఉండేలా పార్లమెంట్ జూన్‌లో 'ఎఐ యాక్ట్'ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. చర్చల సమయంలో యూరోపియన్ పార్లమెంట్ ఎఐ నియమావళికి అమెరికా సహా అన్ని ఎఐ ప్రొవైడర్లు కట్టుబడి ఉండాలని ప్రతిపాదించింది. ఇవి యూరోపియన్ ప్రొవైడర్ల ప్రయోజనాలను దెబ్బతీస్తాయని ఈ మూడు దేశాలు హెచ్చరించాయి. ప్రవర్తనా నియమావళిలో పారదర్శకతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పేర్కొన్నాయి. మొదట్లో ఎటువంటి ఆంక్షలు విధించ కూడదని భావించాయి. డిజిటల్ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో కలిసి ఈ చర్చలకు బాధ్యత వహిస్తున్న జర్మనీ ఆర్థిక మంత్రిత్వ శాఖ, చట్టాలు, దేశం ఎఐని నియంత్రించకూడదని , దాని అప్లికేషన్‌ను మాత్రమే నియంత్రించాలని పేర్కొంది.

మీ కోసం

చింతపండు రంగు మారకుండా ఉండాలంటే, డబ్బాలో కాస్త గళ్ల ఉప్పును వేసుకోవాలి.

జీవన సౌరభం

పొగిడే వాళ్లు నీ చుట్టూ ఉంటే గెలిచినట్లు కాదు. తిట్టే వాళ్లు నీ పక్కన ఉంటే ఓడినట్లూ కాదు.

JEEVANA జీవన the family

కాకి సహాయం

కోయిల సాగరం అనే అడవిలో ఒక చిలుక నివసించేది. ఒకరోజు ఆహార అన్వేషణకు బయలుదేరిన చిలుక, సాయంత్రానికి ఇంటికి చేరేసరికి ఆ చెట్టు మీద ఒక కాకి ఉండడం గమనించింది. 'ఎవరు నువ్వు? ఈ చెట్టుపైన ఎందుకు వాలావు? నిన్ను ఎప్పుడూ ఇక్కడ చూడలేదు?' అని కోప్పడుతూ కాకిని అడిగింది.

'మిత్రమా, నన్ను క్షమించు. నేను ఇక్కడికి వచ్చే సమయానికి ఈ చెట్టు పైన నీవు లేవు. నా పేరు వాయసం. నేను పక్కనే ఉన్న అడవిలో ఉండేదానిని .అక్కడ తాగడానికి నీరు దొరకడం లేదు. ఈ అడవిలో నది ప్రవహిస్తోంది అని తెలుసుకున్నాను. ఇక్కడ తాగడానికి నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. పచ్చని చెట్లు ఉన్నాయి. ఉండడానికి యోగ్యంగా ఉంటుంది. అందుకే ఇక్కడికి వచ్చాను. మిత్రమా, నన్ను కూడా ఈ చెట్టుపై ఉండనివ్వవా? ఇక నుండి మనిద్దరం కలిసిమెలిసి ఉందాం' అని అన్నది వాయసం.

'మాటలు బాగానే నేర్చినట్టు ఉన్నావు. కానీ నీతో ఈ చెట్టుపై కలిసి ఉండడం నాకు ఏమాత్రం ఇష్టం లేదు. వచ్చిన దారినే వెళ్ళు' అని కోపంగా కాకిని వెళ్లగొట్టింది చిలుక.

బాధపడుతూ అక్కడి నుంచి దూరంగా బయలుదేరింది కాకి. నది పక్కన ఉన్న మరొక చెట్టుపై వాలింది. చిలుకతో స్నేహం చేయాలని ఎంతో ఆశపడ్డాను. కానీ, నన్ను ఆదరించలేదు. ఎప్పటికైనా చిలుక మారితే బాగుండు' అనుకుంటూ ఆ చెట్టుపైనే గూడును కట్టుకొని నివసించ సాగింది కాకి.

కొన్ని రోజుల తరువాత చిలుక అడవిలో ఉన్న పళ్ళను తింటూ దాహం వేసి నది దగ్గరికి వెళ్ళింది. నదిలో నీరు తాగుతుండగా ఒక్కసారిగా పెద్ద గాలి వచ్చి నదిలో పడిపోయింది. టపటప రెక్కలు కొట్టుకుంటూ నీటిలో మునిగిపోతున్న చిలుకను పక్కనే ఉన్న చెట్టుపై నివసిస్తున్న కాకి గమనించి రివ్వున ఎగురుకుంటూ వచ్చింది. 'భయపడకు మిత్రమా! నేను నిన్ను కాపాడుతాను. ధైర్యంగా ఉండు' అని అన్నది. తన కాళ్లతో చిలుకను గట్టిగా పట్టుకొని చెట్టు పైకి ఎగిరింది. చలికి గజగజ వణికిపోయింది చిలుక. చిలుకను తన గూటిలో ఉంచి వెచ్చదనాన్ని అందించింది. కొన్ని పళ్ళను తీసుకొచ్చి ఇచ్చింది. ఆశ్రయం ఇవ్వకపోయినా తన మీద కాకి చూపిస్తున్న ప్రేమకు చిలుక సిగ్గుపడింది. 'మిత్రమా! నన్ను క్షమించు. నీ మనసు తెలియక నిన్ను చెట్టుపై నుంచి వెళ్లగొట్టాను. నిన్ను దూరం పెట్టినా నీవు అవన్నీ మనసులో పెట్టకోకుండా ప్రాణాలకు తెగించి నన్ను కాపాడావు. ఇక నుంచి మనిద్దరం కలిసే ఉందాము. మళ్లీ మన చెట్టు మీదికి వెళ్దాంరా' అని బతిమిలాడింది చిలుక. కాకి ఎంతో సంతోషించి చిలుకతో కలిసి రివ్వున ఎగిరింది.

– దేరంగుల స్రవంతి,
10 వ తరగతి.

నేను గీసిన బొమ్మ

జె.రుచిత,
తొమ్మిదవ తరగతి,
రాయిలాపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సినిమాల్లోనూ సరికొత్తగా ...
డాక్టర్ కుమార్ నాయక్

ప్రతిభ, ప్రయత్నమూ ఉంటే ఏ రంగంలోనైనా రాణించొచ్చనని వెండితెర సాక్షిగా నిరూపించారు డాక్టర్ కుమార్ నాయక్. చిన్ననాటి నుంచే ఉన్న కళాతృష్ణ ఆయన్ని, నిరంతరం ఓ కళాకారుడిగానే ఎదగనిచ్చింది. చిన్ననాడు కోయ నృత్యం ద్వారా కళాకారుడిగా గుర్తింపు పొందిన ఆయన.. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే- అనేక సాంఘిక, పౌరాణిక నాటకాల్లో నటించారు. హాస్టల్ వార్డెన్‌గా మూడు దశాబ్దాలపాటు విధులను నిర్వహించి, ఉత్తమ అధికారిగా ప్రభుత్వ పురస్కారం అందుకున్నారు. తన అభిరుచికి అనుగుణంగా షార్ట్, టెలిం ఫిలింలలో నటించి ప్రేక్షకులను మెప్పించారు. ఇప్పుడు బుల్లితెర నుంచి వెండితెరకు పరిచయమై, వివిధ పాత్రలతో అలరిస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లా పలాస మండలం కాశీబుగ్గ గ్రామానికి చెందిన డాక్టర్ కుమార్ నాయక్ ఇప్పటివరకూ 22 సినిమాల్లో నటించారు. ఆరు సినిమాలు విడుదల కాగా, మిగతావి విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. హీరో హీరోయిన్లకు తండ్రి పాత్రగానూ, విలన్‌గాను, రాజ గురువుగానూ, కమెడియన్‌గానూ, క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ నటించి మెప్పిస్తున్నారు

కుమార్ నాయక్... కాశీబుగ్గ గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో సురేఖ, హాడియ నాయక్‌ల రెండో సంతానంగా 1961లో జన్మించారు. తన ఎనిమిదో యేటనే గ్రామీణ ఉత్సవాల్లో జరిగే కోయ నృత్య బృందంలో చేరారు. వందలాది కళా ప్రదర్శనలు ఇచ్చారు. డబుల్ ఎంఎ చదివి, 1982లో శ్రీకాకుళం జిల్లాలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 2021లో ఉద్యోగ విరమణ తరువాత తన కళారంగ కృషిని మరింతగా కొనసాగించారు. సినిమా, టీవీ రంగాల ద్వారా సామాజిక చైతన్యానికి శ్రీకారం చుడుతున్నారు.

వెండి తెరపై ...

వీర గున్నమ్మ, రెండక్షరాల ప్రేమ, నాకొక శ్రీమతి కావాలి, సురభి 70 ఎంఎం, పలాస 1978, వాడు ఎవడు వంటి సినిమాల్లో నాయక్ నటించారు. ఆయన నటించి ఇంకా విడుదల కాని సినిమాల్లో దివ్య 87, దామినివిల్లా, ఎవడి సిన్మాకి వాడే హీరో, నీ వెంటే నేనుంటా, పాంచాలి, ప్రత్యంగరదేవి, మావూరి మంకినమ్మ, లవ్ ఆఫ్ లక్ష్మీపురం, సత్యాన్వేషి, అంతర్యామి, పల్లె గూటికి పండగొచ్చింది, రెడ్డిగారి అబ్బాయి, గీత, హిట్లర్ (ఒడియా), క్రేజీ 3, అల్లరి గూఢచారులు వంటివి ఉన్నాయి. ఆయన నటించిన అసమర్థుడు, బాణామతి, దొంగలొస్తున్నారు జాగ్రత్త, గారాల పుత్రుడు, రాజకీయం, సంతానం, ఝాన్సీ వెడ్స్ రామకష్ణ, బంధం వంటి సింగిల్ ఎపిసోడ్స్ ఈటీవీ2లో ప్రసారం అయ్యాయి. విజ్ఞప్తి, జీవితం, సప్త వర్ణాలు, గాంధమ్మోరు, మిస్సడ్‌కాల్, వైశాలి, చినుకు, బ్రహ్మారాక్షసి, వీరగున్నమ్మ, తీరని పగ, మనసు, ఐతే ఒకే, మేలు కొలుపు, అంజు అంజు, ఇది కథ కాదు, మంజరి వంటి టెలిఫిలింలలో తన నటనతో అలరించారు.

వివిధ పాత్రల్లో ...

వీరగున్నమ్మ సినిమాలో మందస సామంతరాజుల కథను ఇతివృత్తంగా తీసిన ఈ సినిమాలో రాజగురువుగా తన నటనతో ఆకట్టుకున్నారు. రాజులకు సలహాలు ఇచ్చే కన్నింగ్ పాత్రలో నటించి తన డైలాగులతో అలరించారు. 'రెండక్షరాల ప్రేమ' సినిమాలో హీరోయిన్‌కు తండ్రి పాత్రలో చదువు- సంస్కారం ఉంటేనే పుట్టినింట, మెట్టినింట బతక గలవమ్మా అంటూ చెప్పి స్కూలు బస్సు ఎక్కించిన ఘట్టం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 'నాకొక శ్రీమతి కావాలి' సినిమాలో హీరోయిన్ తండ్రి పాత్రలో నటించారు. ఆడపిల్ల తండ్రి మనసులో ఏర్పడిన సంఘర్షణ బయటకు చెప్పలేక లోలోపల మధనపడుతున్న ఘట్టాలు ప్రేక్షకులకు హత్తుకున్నాయి.

'పలాస 1978' సినిమాలో హీరో హీరోయిన్ల మధ్య పాటల పోటీలో న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. 'పల్లెగూటికి పండగొచ్చింది' సినిమాలో ప్రముఖ నటుడు సాయికుమార్‌తో 'సామాన్యుడికి సినిమాలో ఛాన్స్ ఎక్కడ ఉంటుంది సార్. నేటి హీరో హీరోయిన్ల తెర వెనుక తల్లితండ్రుల ప్రోత్సాహమే ఉంది కదా?' అని డైలాగు చెప్పే సన్నివేశం ఉంది. 'వాడు ఎవడు' సినిమాలో హీరోయిన్ తండ్రిగా అల్లుడు చేతిలో హత్యకు గురైన తన కూతురును చూసి కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ ఆధునిక యుగంలో ఆడపిల్లలకు ఎంత ఇచ్చినా.. ఎంత చక్కగా పెంచినా రక్షణ లేకుండా పోయిందంటూ హృద్యంగా నటించారు. పొలిమేర సినిమాలో కానిస్టేబుల్ పాత్రలో నటించారు. అంతర్యామి సినిమాలో ప్రముఖ నటి ఆమనితో కలిసి ఒక సన్నివేశంలో 'ఏంటి మా అబ్బాయి మీ అమ్మాయిని చంపేశాడా... నేనైతే నమ్మలేకపోతున్నాను. అయ్యో రామా.. సరేనమ్మా.. మీరు ఏం చేస్తారు? నా కొడుక్కి కఠిన శిక్ష విధిస్తే నాకు ఎలాంటి అభ్యంతరమూ లేదమ్మా' అంటూ సాగిన సన్నివేశంలో నటించారు. ఒరియా సినిమా అంతర్యామిలో కమెడియన్‌గా నటించారు. ఒరియాలో తానే డబ్బింగ్ కూడా చెప్పారు. సాంఘిక, పౌరాణిక నాటకాల్లో కూడా నటించి తన ప్రత్యేకతను చాటుకున్నారు కుమార్ నాయక్. ఇటీవల హైదరాబాదులో బెస్ట్ డైలాగ్ ఆర్టిస్ట్‌గా ప్రముఖ నటుడు సుమన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2003లో ఒడిశా ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగో చేతుల మీదుగా ఉత్తమ టెలిఫిలిం ఆర్టిస్టుగా అవార్డును అందుకున్నారు.

సినీ కళాకారుల సంక్షేమం కోసం ...

సినిమా పరిశ్రమలోని 26 క్రాఫ్ట్స్ (యూనియన్లు) సంబంధించిన కళాకారుల సంక్షేమం కోసం ఎపి చలనచిత్ర టీవీ కోఆపరేటివ్ సొసైటీ రాష్ట్ర వైస్‌చైర్మన్‌గానూ, ఎపి తెలుగు ఫిలిం అండ్ ఆర్టిస్ట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా, కళాతపస్వి ఫిలిం అసోసియేషన్ (పలాస) అధ్యక్షుడిగానూ, ఎపి తెలుగు ఫిలిం అండ్ టివి ఫిలిం ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగానూ డాక్టర్ కుమార్‌నాయక్ ఉన్నారు.

– యడవల్లి శ్రీనివాసరావు

చికెన్ ధరలు నేలచూపులు

- రిటైల్ రూ.180, లైవ్ రూ.140
- కార్తీక మాసం ఎఫెక్ట్
- నష్టాల బాటలో పౌల్ట్రీ రైతులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

చికెన్ ధరలు నేలచూపులు చూస్తున్నాయి. రిటైల్ ధర రూ.180 కాగా, లైవ్ చికెన్ రూ.140 మించడం లేదు. ఇందులో పౌల్ట్రీ రైతుకు రూ.108 మించి దక్కడం లేదు. కార్తీకమాసం వల్ల ప్రజలు మాంసాహారానికి దూరంగా ఉండడంతో డిమాండ్ లేక ధరలు తగ్గిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. పెరుగుతున్న మేత ధరలు, విద్యుత్ ఛార్జీలకు తోడు కోళ్ల ధర నిలకడగా లేకపోవడం వంటి పరిణామాలతో పౌల్ట్రీ పరిశ్రమపై ఆధారపడిన వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఏడాదిలో మూడు నెలలు మాత్రమే ఆశాజనకంగా ఉంటోంది. కోళ్ల పెంపకానికి అయ్యే ఖర్చు, వచ్చే ఆదాయానికి సరిపోతోందని, తమకు శ్రమకు ఫలితం దక్కడం లేదని పౌల్ట్రీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీలు ఉన్నాయి. దాదాపు 1.40 కోట్ల కోళ్ల పెంపకం సాగుతోంది. కిలో కోడి పెంపకానికి, మార్కెట్ చేర్చడా నికి రవాణా ఖర్చు కలిపి రూ.120 వరకూ అవుతోంది. కేజీ బాయిలర్ కోడి రైతు ధర రూ.108, రిటైల్ ధర రూ.140 ఉంది. కేజీ చికెన్ ధర రూ.180 కాగా, స్కిన్ లెస్ రిటైల్ మార్కెట్లో రూ.200 చొప్పన విక్రయాలు జరిగాయి. రాష్ట్రంలో సరాసరి ఐదు కోట్ల కోళ్ల పెంపకం జరుగుతున్నట్లు అంచనా. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాటా 28 శాతం. ప్రత్యక్షంగా 20 వేలమంది, పరోక్షంగా మరో 20 వేల మంది మొత్తం 40 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమ వల్ల లారీ పరిశ్రమకు కూడా ఉపాధి లభిస్తోంది. రైతుల వద్ద కోళ్లను కొనుగోలు చేసి వ్యాపారులు ఒడిశా, బీహార్, బెంగాల్ తదితర రాష్ట్రాలకు లారీల్లో ఎగుమతి చేస్తుంటారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పౌల్ట్రీలకు ప్రోత్సాహం ఇస్తున్నాయి. దీంతో, అక్కడ పౌల్ట్రీలు గణనీయంగా పెరిగాయి. ఈ ప్రభావం జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమపై పడింది. గత రెండేళ్ళుగా కోళ్ల ఫారాలలో బ్యాచ్‌లు వేసేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. ఏటా పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, రాబడి క్రమక్రమంగా తగ్గిపోవడమే ఇందుకు కారణమని రైతులు చెబుతున్నారు. కోడి పిల్ల ధర రూ.35 కాగా, లేబర్ ఛార్జీ రూ.6, మెడిసిన్ ఖర్చు రూ.10, కరెంట్ బిల్లు రూ.1, వరి పొట్టుకు రూ.5, ఇతర ఖర్చులు రూ.3, ట్రేడర్ తరుగుదల కింద రూ.40 చొప్పన మొత్తంగా రెండు కిలోల కోడి పెంపకానికి రూ.240 ఖర్చు అవుతోంది. కిలో లైవ్ కోడి రూ.130 చొప్పన విక్రయిస్తే కొంతమేర ఆశాజనకంగా ఉన్నట్లేనని రైతులు చెబుతున్నారు. కోళ్లఫారంలో పది వేల కోళ్లను పెంచితే కోడికి (2 కిలోలు) రూ.240 చొప్పన రెండు నెలలకు సుమారు రూ.24 లక్షల ఖర్చవుతుంది. కోళ్ల పెంపకానికి మొక్కజొన్న, సోయా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా ధర టన్నుకు ఏడాదిలో రూ.18 వేల నుంచి రూ.25 వేలు, సోయా రూ.50 వేల నుంచి రూ.80 వేలకు పెరిగింది. కోడి ధర పెరగకపోవడంతో తమ శ్రమంతా వృథా అవుతోందని రైతులు వాపోతున్నారు. సాధారణంగా రెండు కిలోల కోడిగా ఎదిగేందుకు రెండు నెలల సమయం పడుతుంది. ఈ కాలంలో కోడి మూడున్నర కిలోల దాణా తింటుంది. కిలో దాణాకు రూ.60 చొప్పన మూడున్నర కిలోలకు రూ.210 వరకు ఖర్చు అవుతుంది.

అత్యధికమంది రైతులు కొత్త బ్యాచ్‌లు వేయలేదు

చికెన్ ధరలు గత కొంతకాలంగా ఆశాజనకంగా లేవు. ఏడాదిలో రెండు లేదా మూడు నెలలు మాత్రమే గిట్టుబాటు ధర వస్తోంది. మిగిలిన కాలమంతా నష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం లైవ్ కేజీ రూ.108 చొప్పున కొనుగోలు జరుగుతోంది. ఈ ఏడాది అత్యధికమంది రైతులు కొత్త బ్యాచ్‌లు వేయలేదు. లేనిపక్షంలో ధరలు ఇంకా నేలను తాకేవి. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో పౌల్ట్రీ రంగం నష్టపోవడంతోపాటు అనుబంధ రంగాలపైనా ప్రభావం చూపుతోంది. ఉపాధి దెబ్బతింటోంది.

– బి.హరిదుర్గాప్రసాద్,
చికెన్ హోల్‌సేల్ వ్యాపారి

రూ. కోట్లు కొల్లగొట్టి గుంతలు మిగిల్చారు

- గుంతల వద్ద టిడిపి, జనసేన వినూత్న నిరసనలు

ప్రజాశక్తి – యంత్రాంగం

రూ. కోట్లు కొల్లగొట్టి రహదారులపై గోతులు మిగిల్చారని టిడిపి, జనసేన పార్టీల నాయకులు ఆరోపించారు. వర్షాలకు ఏర్పడిన గోతులకు కూడా మరమ్మతులు చేయలేని దీనస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేదీ'? అంటూ టిడిపి–జనసేన ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం రెండోరోజూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగింది. జాతీయ, ప్రధాన, గ్రామీణ రోడ్లపై ఏర్పడిన గుంతల వద్ద నాయకులు వినూత్న నిరసనలు తెలిపారు. రహదారుల దుస్థితి గురించి ప్రజలకు వివరించారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలం కొర్లకుంట గ్రామం నుంచి నేలపాటి వారి గుంట మీదుగా కాట్రేనిపాడు, గోపవరం వరకూ టిడిపి, జనసేన నాయకులు పాదయాత్ర నిర్వహించారు. రహదారిపై ఏర్పడిన గుంతల వద్ద పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. 'జగనన్న ఈ రోడ్ల దుస్థితి ఏంటన్న.. నువ్వు అధికారంలోకి వచ్చాక రోడ్ ట్యాక్స్ పేరుతో లీటర్ ఇంధనానికి రూపాయి అదనంగా వసూలు చేస్తున్నావు.. నాలుగున్నరేళ్ల అయినా రోడ్లను అభివృద్ధి చేయాలని అనిపించడం లేదా' అంటూ టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో అక్కుర్తి రోడ్డుపై పడిన గుంతల వద్ద ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. రూ. ఐదు కోట్లు కొల్లగొట్టి రహదారుల్లో గుంతలు మిగిల్చారని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. గూడూరు – విందూరు రహదారి దుస్థితిని ప్రజలకు తెలియజేస్తూ నిరసన తెలిపారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం – నర్సీపట్నం రహదారి గోతులపై నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు. విశాఖ జిల్లాలోని చినగంట్యాడ జగ్గు జంక్షన్ ప్రధాన రహదారిలో ఉన్న గోతుల్లో మొక్కలు నాటి నిరసన తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు, ఏలేశ్వరం మండలం రమణయ్యపేట–జె.అన్నవరం రోడ్డులో ఏర్పడిన గుంతల్లో దిగి నిరసన తెలిపారు. ఉమ్మడి అనంతపురం ,శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపునం మన్యం జిల్లాల్లో నిరసన తెలిపారు.

వైఎస్ఆర్ జిల్లాలో ఏర్పడిన గుంతల వద్ద నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, కోనసీమ జిల్లాల్లోనూ పలు చోట్ల రోడ్ల మరమ్మతుల కోసం ఆదందోళనలు చేపట్టారు.

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం రమణయ్యపేట-జె.అన్నవరం రోడ్డులో టిడిపి, జనసేన నాయకుల నిరసన

ఆశలు ఆవిరి

ప్రపంచకప్ ఫైనల్లో భారత్ ఓటమి
ఆరోసారి చాంపియన్‌గా నిలిచిన ఆస్ట్రేలియా
ఛేదనలో ట్రావిశ్ హెడ్ మెరుపు సెంచరీ

అహ్మదాబాద్ : ఆతిథ్య భారత్ ఆశలు ఆవిరి. 2023 ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియా. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 241 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన ఆస్ట్రేలియా రికార్డు ఆరో వరల్డ్‌కప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (137, 120 బంతుల్లో 15 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా, మార్నస్ లబుషేన్ (58 నాటౌట్, 110 బంతుల్లో 4 ఫోర్లు) అజేయ అర్థ సెంచరీతో సమయోచిత ఇన్నింగ్స్ నమోదు చేశాడు. హెడ్, లబుషేన్ నాల్గో వికెట్‌కు 192 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. 43 ఓవర్లలోనే ఆస్ట్రేలియాకు విజయాన్ని కట్టబెట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 240 పరుగులు చేసింది. కెఎల్ రాహుల్ (66, 107 బంతుల్లో 1 ఫోర్), విరాట్ కోహ్లి (54, 63 బంతుల్లో 4 ఫోర్లు), రోహిత్ శర్మ (47, 31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. ఛేదనలో మెరుపు సెంచరీతో విశ్వరూపం చూపించిన ట్రావిశ్ హెడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ట్రావిశ్ హెడ్ అదుర్స్ : ఛేదనలో ఆసీస్‌కు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. డెవిడ్ వార్నర్ (7), మిచెల్ మార్ష్ (15), స్టీవ్ స్మిత్ (4)లు బుమ్రా, షమి దెబ్బకు పెవిలియన్‌కు చేరారు. 47/3తో ఆస్ట్రేలియా ఒత్తిడిలో పడింది. కానీ ఓపెనర్ ట్రావిశ్ హెడ్ మరో ఎండ్‌లో ధ్వంస రచన సాగించాడు. సహజ శైలికి విరుద్ధంగా పవర్‌ప్లేలో కాస్త నెమ్మదించిన హెడ్.. ఆ తర్వాత విరుచుకు పడ్డాడు. స్పిన్నర్లు జడేజా, కుల్దీప్‌లపై భారీ షాట్లు ఆడాడు. పరుగుల రాకతో ఆసీస్ శిబిరం తేలికపడింది. మార్నస్ లబుషేన్ మరో ఎండ్ నుంచి హెడ్‌కు చక్కటి సహకారం అందించాడు. స్ట్రయిక్ రొటేట్ చేస్తూ భారత బౌలర్ల ఉత్సాహాన్ని నీరుగార్చాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో హెడ్ అర్థ సెంచరీ సాధించగా.. 14 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 95 బంతుల్లోనే శతకం అందుకున్నాడు. మార్నస్ లబుషేన్ మూడు ఫోర్ల అండతో 99 బంతుల్లో అర్థ సెంచరీ చేశాడు. మిడిల్ ఓవర్లలో మంచు ప్రభావంతో భారత బౌలర్లు తేలిపోగా.. హెడ్, లబుషేన్ పరుగులు పిండుకున్నారు. ఈ జోడీని విడదీయటంలో విఫలమైన భారత్.. ప్రపంచకప్ టైటిల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఆఖర్లో గ్లెన్ మాక్స్‌వెల్ (2 నాటౌట్) గెలుపు పరుగులతో ఆసీస్ శిబిరంలో సంబురాలకు తెరతీశాడు.

మెరిసిన ఆ ముగ్గురు : టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఫైనల్లో ఆతిథ్య టీమ్ ఇండియా తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. కెప్టెన్ రోహిత్ శర్మ (47) తనదైన దూకుడుతో ఇన్నింగ్స్‌ను మొదలెట్టాడు. ఆసీస్ ఫీల్డర్లు బౌండరీలు నిలువరించినా.. రోహిత్ శర్మ దంచికొట్టాడు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో ఆసీస్ శిబిరంలో గుబులు పుట్టించాడు. ఓ ఎండ్‌లో గిల్ (4) తడబాటుకు గురైనా రోహిత్ మాత్రం అలవోకగా బౌండరీలు బాదాడు. ఆరంభంలోనే స్లిప్స్‌లో జీవనదానం పొందిన గిల్.. అవకాశం వృథా చేసుకున్నాడు. మిచెల్ స్టార్క్ వేసిన షార్ట్ బాల్‌కు సర్కిల్ లోపలే క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. మాక్స్‌వెల్‌పై భారీ సిక్సర్‌తో అర్థ సెంచరీ ముంగిట నిలిచిన రోహిత్ శర్మ.. అదే ఓవర్లో ట్రావిశ్ హెడ్ కండ్లుచెదిరే క్యాచ్‌తో పెవిలియన్‌కు చేరాడు. దీంతో పవర్‌ప్లేలోనే టీమ్ ఇండియా ఓపెనర్లు ఇద్దరినీ కోల్పోయింది. రోహిత్ శర్మ దూకుడుతో పవర్‌ప్లేలో టీమ్ ఇండియా దండిగా పరుగులు చేసింది. తొలి పది ఓవర్లలో భారత్ 80/2తో నిలిచింది.

స్లో పిచ్‌పై పవర్‌ప్లే తర్వాత భారత్‌కు పెద్దగా కలిసిరాలేదు. ఫామ్‌లో ఉన్న బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ (4) నిష్క్రమణతో టీమ్ ఇండియా శిబిరం ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో విరాట్ కోహ్లి (54), కెఎల్ రాహుల్ (66) భారత్‌కు మంచి స్కోరు అందించారు. పరుగుల వేట కష్టమైన దశలో వికెట్ నిలుపుకుని ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. పవర్‌ప్లే అనంతరం ఏకంగా 97 బంతుల పాటు బౌండరీ రాకపోవటంతో స్కోరు బోర్డు పిచ్ కంటే ఎక్కువగా నెమ్మదించగా.. ఆసీస్ బౌలర్లలో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. క్రీజులో కుదురుకున్న విరాట్ కోహ్లి నాలుగు బౌండరీలతో 56 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. కమిన్స్ ఓవర్లో బంతిని వికెట్లపైకి ఆడుకున్న కోహ్లి అనూహ్యంగా నిష్క్రమించి అభిమానుల్లో నైరాశ్యం నింపాడు. కోహ్లి నిష్క్రమణ తర్వాత రాహుల్ మరింత నెమ్మదించాడు. ఓ ఫోర్‌తో 86 బంతుల్లో అర్థ సెంచరీ సాధించినా.. మరో ఎండ్‌లో రవీంద్ర జడేజా (9) నిరాశపరిచాడు. సూర్యకుమార్ యాదవ్ (18)కు స్లో బౌన్సర్లతో పరీక్ష పెట్టిన ఆసీస్ ఆ దిశగా విజయవంతమైంది. టెయిలెండర్లలో కుల్దీప్ యాదవ్ (10), మహ్మద్ సిరాజ్ (9 నాటౌట్) ఆకట్టుకున్నారు. 50 ఓవర్లలో ఆలౌటైన భారత్ 240 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు పడగొట్టగా. జోశ్ హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్ రెండేసి వికెట్లు తీశాడు. స్పిన్నర్లు గ్లెన్ మాక్స్‌వెల్, ఆడం జంపా పరుగుల పొదుపుతో చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

ఓటమి భారంతో రోహిత్

కపిల్‌కు అవమానం

న్యూఢిల్లీ : క్రికెట్‌లో భారత్‌కు తొలి ప్రపంచ కప్ సాధించిన 1983 జట్టు సారథి, దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్‌కు అవమానం జరిగింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఆదివారం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు ఆయనను బిసిసిఐ ఆహ్వానించలేదు. ఈ విషయాన్ని కపిల్ దేవ్ వెల్లడించారు. ఫైనల్‌కు హాజరు కాకపోవడంపై ఒక జాతీయ వార్తా సంస్థ ప్రతినిధి అడిగిన ప్రశ్నకు కపిల్ స్పందిస్తూ..'నాకు ఆహ్వానం లేదు. వారు నన్ను పిలవలేదు. అందుకే వెళ్లలేదు..అంతే' అని ఆయన తెలిపారు. 1983 టీమ్ మొత్తాన్ని ఈ వేడుకకు ఆహ్వానించాలని తాను కోరుకున్నానని, ఇంతటి పెద్ద వేడుకకు ఆహ్వానించకపోవడం అంటే బహుశా వారంతా బిజీబిజీగా ఉండటం వల్ల సాధ్యం కాలేదేమోనని కపిల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులను కూడా ఈ వేడుకకు ఆహ్వానించిన బిసిసిఐ పెద్దలు కపిల్‌ను విస్మరించడంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపుల నుంచి తమను రక్షించాలని కోరుతూ ఢిల్లీలో రెజ్లర్లు నిర్వహించిన పోరాటానికి కపిల్ మద్దతు ఇచ్చారు. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఆయన పట్ల గుర్రుగా ఉన్నారు. అందుకనే ఈ వేడుకలకు కూడా కపిల్‌ను కావాలనే ఆహ్వానించలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68